మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ 02 శనివారం నవంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 47




# ఎన్నికల వేడ్థీ

- అమెరికాలో అధ్యక్ష ఎన్నికల వేడి
- ఇప్పటికే ఓటేసిన 6 కోట్ల మంది
- ముందస్తు ఓటింగ్ ప్రక్రియలో పోలింగ్ కేంద్రాలకు
- మరికొందరు మెయిల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న అధ్యక్షుడు జో బైడెన్
- పలు సర్వేల్లో హారిస్,ట్రంప్ మధ్య గట్టి పోటీ



**వాషింగ్టన్-నవభూమిబ్యూరో:** అమెరికాలో మరి కొన్ని రోజుల్లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాటుచేసిన ముందస్తు ఓటింగ్‌ను ఉపయోగించుకొని ఇప్పటికే దాదాపు 6.1 కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు అక్కడి మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలాహారిస్, రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్‌లు బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఈ ముందస్తు ఓటింగ్ ప్రక్రియలో అనేకమంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లగా.. మరికొంతమంది మెయిల్ బ్యాలెట్ ద్వారా ఓటేసినట్లు తెలుస్తోంది.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఇటీవల తన ఓటుహక్కును వినియోగించుకున్న సంగతి

## కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్

# గడువు మరోసారి పొడిగింపు?

- కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ నియామకం
- వందరోజుల్లో విచారణ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- వందరోజుల గడువు పూర్తవ్వడంతో రెండుసార్లు పొడిగింపు
- తాజాగా మరోసారి గడువు పొడిగించనున్న కాంగ్రెస్ సర్కార్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను నియమించింది. దీనిపై వంద రోజుల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అందుకు అనుగుణంగా జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, మొదటి వంద రోజుల గడువు జూన్ నెలాఖరుతో పూర్తయింది. దీనిపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రెండుసార్లు రెండు నెలల చొప్పున కమిషన్ గడువును పొడిగించింది. ప్రభుత్వం పొడిగించిన గడువు నేటితో పూర్తికానుంది. అయితే, జస్టిస్ పీసీఘోష్ కమిషన్ విచారణ

## త్వరలో

# కేటీఆర్ పాదయాత్ర

- తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్ పాదయాత్ర
- కార్యకర్తల ఆకాంక్షల మేరకు కీలక నిర్ణయం
- దీపావళిరోజున సోషల్ మీడియోలో నెటిజన్లతో ఇంట్రాక్ట్
- నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం
- దాదారు గంటన్నర పాటు సాగిందీ లైవ్ డిస్కషన్
- కాంగ్రెస్ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ దిల్లీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అభ్యర్థన మేరకు సమీప భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రకటించారు.

దీపావళిరోజున సోషల్ మీడియోలో నెటిజన్లతో ఇంట్రాక్ట్ అయ్యారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ టైంలోనే పాదయాత్ర ప్రస్తావన వచ్చినప్పుడు తాను చేయబోతున్నట్టు వెల్లడించారు. దీపావళి రోజున నెటిజన్లతో కేటీఆర్ ఇంట్రాక్ట్ అయ్యారు. దాదారు గంటన్నర పాటు సాగిందీ లైవ్ డిస్కషన్. రాష్ట్ర రాజకీయాల నుంచి దేశ రాజకీయాలు, సినిమాలు ఇలా చాలా అంశాలపై అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణ రాష్ట్రానికి శాపంలా మారిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ఉద్దేశం లేకనే అబద్ధాల మీద, అసత్యాల మీద టైం వేస్ట్ చేస్తూ మోసం చేస్తున్నారన్నారు. పది నెలల కాలంలో కాంగ్రెస్ చేసిన ఒక్క మంచి అయినా గుర్తు రావడం లేదన్నారు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ నుంచి ఇంతకంటే గొప్ప పాలన ఆశించలేమన్నారు. వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులు ప్రారంభించింది అన్నారు కేటీఆర్. సన్నవడ్లకు బోనస్ ఇస్తామన్న హామీ బోగస్గా మారిందని, ఓట్లు వేసిన రైతులు కనీస ధర లేక రైతుబంధు రాక నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ డీల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు.

**కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం పతనం**

4 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారం పోవడం ఖాయమని... కానీ చేసిన నష్టం నుంచి తెరుకోవడం అతిపెద్ద సవాలుగా కేటీఆర్ అభివర్ణించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనమైందన్నారు. అన్ని రంగాల్లో వెనక్కి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులున వ్యవసాయ, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగితక పెరిగిందని కంపెనీలు తరలిపోతున్నాని, దీనిపై ప్రభుత్వానికి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు.

**ప్రజల పక్షాన కొట్లాడడమే**

ప్రధాన ప్రతిపక్ష బాధ్యతలు నిర్వహించడంపైన దృష్టి సారించామని తెలిపిన కేటీఆర్. హామీల

## ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు

# రాజ్ పాకాల

- జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో నిందితుడు రాజ్
- చేవెళ్ల ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు హాజరు
- న్యాయవాదితో కలిసి చేవెళ్లకు వచ్చిన రాజ్
- రాజ్‌ను ప్రశ్నించిన జిల్లా డిప్యూటీ కమిషనర్



**హైదరాబాద్-నవభూమిబ్యూరో** : జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో నిందితుడు, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల అలియాస్ పాకాల రాజేంద్రప్రసాద్ శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు హాజరయ్యారు.

న్యాయవాదితో కలిసి వచ్చిన రాజ్ పాకాలను రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. విదేశీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి వద్ద కొనుగోలు చేశారనే అంశాలపై ప్రధానంగా విచారిస్తున్నట్టు సమాచారం.

బుధవారం రాజ్ పాకాలను 7గంటలకు పైగా మోకిల పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం విడిచిపెట్టారు. బీఎన్ఎస్ఎస్ 35 (3) సెక్షన్ కింద మరోసారి పిలిస్తే విచారణకు రావాలని పోలీసులు సూచించారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఎక్సైజ్ పోలీసుల ఎదుట రాజ్ పాకాల విచారణకు హాజరయ్యారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** శంషాబాద్ విమానాశ్రయంలో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 7.096 కిలోల హైడ్రోఫోలిక్ వీడ్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఇందుకు సంబంధించి బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కొత్తగా బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డికి టీటీడీ పాలకమండలిలో చోటు


### టీటీడీ పాలకమండలి సభ్యుల పూర్తి జాబితా విడుదల

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఇటీవలే ఏపీ ప్రభుత్వం 24 మందితో టీటీడీ నూతన పాలకమండలిని ప్రకటించింది. చైర్మన్ గా టీవీ5 అధినేత బీఆర్ నాయుడును నియమించింది. టీటీడీ చైర్మన్, సభ్యుల పూర్తి జాబితాను నేడు విడుదల చేశారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా టీటీడీ బోర్డులో బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డికి చోటు కల్పించారు. తాజాగా, మరో నలుగురిని ఎక్స్ అఫిషియో మెంబర్లుగా నియమించారు. ఎక్స్ అఫిషియో మెంబర్లుగా రెవెన్యూ శాఖ కార్యదర్శి, విజయవాడ పరిధి దేవాదాయ శాఖ కమిషనర్, తుడా చైర్మన్, టీటీడీ ఈవో వ్యవహరిస్తారు.

# చినాబ్ వంతెనపై కన్ను

- చైనా కోరిక మేరకు పాక్ దృష్టి
- భారత ఇంటలిజెన్స్ వర్గాల వెల్లడి
- జమ్మూకశ్మీర్‌లోని రైసీ, రామబాణ్ జిల్లాల మధ్య నిర్మిస్తున్న వంతెన
- వివరాలు సేకరించే పనిలో పాక్
- చీనాబ్‌పై నిర్మిస్తున్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వంతెనగా గుర్తింపు

2



**శ్రీనగర్-నవభూమిబ్యూరో:** జమ్మూకశ్మీర్‌లోని చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనపై పొరుగు దేశం పాకిస్థాన్ కన్నేసినట్లుగా ఇంటలిజెన్స్ వర్గాలు పేర్కొన్నట్లు పలు మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి.

జమ్మూకశ్మీర్‌లోని రైసీ, రామబాణ్ జిల్లాల మధ్య నిర్మిస్తున్న ఈ వంతెనకు సంబంధించిన వివరాలు సేకరించమని చైనాపాకిస్థాన్‌ను కోరడంతో ఆ దేశ ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ బ్రిడ్జి గురించిన కీలకమైన విషయాలు

## పునరుత్పాదక ఎకనమిక్

# జోన్ల ఏర్పాటు

- రాష్ట్రంలో ఆర్ఈజెడ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- సౌర, పవన, హైబ్రిడ్, బ్యాటరీ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తికి ఆర్ఈజెడ్ ఏర్పాటు
- పునరుత్పాదక ఎనర్జీ జోన్లనూ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టీకరణ
- ఆధునిక సాంకేతికతో ఉత్పత్తి చేసే విద్యుత్ ప్లాంట్లకు వీజీఎఫ్ సదుపాయం

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

రాష్ట్రంలో పునరుత్పాదక ఎకనమిక్ జోన్లు (ఆర్ఈజెడ్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీన్ ఎనర్జీ పాలసీలో ఆర్ఈజెడ్‌ల ఏర్పాటు గురించి ప్రభుత్వం పేర్కొంది.

సౌర, పవన, హైబ్రిడ్, బ్యాటరీ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తికి ఆర్ఈజెడ్‌లను ఏర్పాటు చేయనుంది. పునరుత్పాదక ఎనర్జీ జోన్లనూ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆధునిక సాంకేతికతో ఉత్పత్తి చేసే విద్యుత్ ప్లాంట్లకు వీజీఎఫ్ సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొంది. ఆర్ఈ వనరుల కార్పొరేషన్, సోలార్ పవర్ కార్పొరేషన్ ద్వారా ఆర్ఈజెడ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.

భవిష్యత్ ఇంధనంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. తక్కువ ధరకే గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టింది. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌తో కలిసి ప్రాజెక్టులు చేయాలని భావిస్తోంది. గ్రీన్ హైడ్రోజన్

# మందుబాబులకు షాక్!

- త్వరలోనే భారీగా పెరగనున్న మద్యం ధరలు తెలంగాణ ఎక్సైజ్ శాఖ కసరత్తు
- ఏపీమద్యం ధరలకు సమానం చేయాలని యోచన
- బీరుపై రూ. 20 లిక్కర్‌పై రూ. 20 నుంచి 70 వరకు పెంచే ప్రయత్నం
- రూ.1000 కోట్ల అదనపు ఆదాయం వచ్చే అవకాశం



**అమరావతి-నవభూమిబ్యూరో:** తెలంగాణలో మందుబాబులకు షాకింగ్ న్యూస్. త్వరలోనే రాష్ట్రంలో మద్యం ధరలను సవరించే దిశగా అబ్కారీ శాఖ కసరత్తు ప్రారంభించింది.

ఏపీలో మద్యం ధరలకు సమానం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో బీరుపై రూ. 20 లిక్కర్ పై రూ. 20 నుంచి 70 వరకు పెంచేందుకు ప్రయత్నం జరుగుతున్నట్లు అబ్కారీ శాఖ తెలిపింది. ధరలు పెంచడం ద్వారా ప్రతినెలా రూ. 1000కోట్లు అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

సర్కార్ ఆశించిన స్థాయిలో ఎక్సైజ్ శాఖలో ఆదాయం రావడం తగ్గింది. గుడుంబాతోపాటు అక్రమ మద్యం తయారీ సరఫరా, విక్రయాలు పెరిగియాని ఆ శాఖ ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6 నెలల్లో నమోదు చేసిన కేసుల సంఖ్య స్పష్టంగా తెలుపుతోంది.

గతేడాది మొదటి ఆరు నెలల్లో 9,108 గుడుంబా కేసులు నమోదు కాగా ఈ ఏడాది అదే సమయంలో 18, 826 కేసులు నమోదయ్యాయి. అంటే రెట్టింపు కేసులు నమోదవ్వడంతో పాటు పదివేల మందికి పైగా గుడుంబా కేసుల్లో అరెస్టు చేశారు.

అక్రమ మద్యం సరఫరా, గుడుంబా తయారీని అడ్డుకునేందుకు అబ్కారీ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటూ ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఎక్సైజ్ శాఖ ద్వారా వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీల ద్వారా రూ. 36వేల కోట్లకుపైగా ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 6 నెలల్లో అబ్కారీ శాఖకు వచ్చిన ఆదాయం ఎక్సైజ్ డ్యూటీ ద్వారా రూ. 9, 493 కోట్లు, వ్యాట్ ద్వారా మరో రూ. 8, 040 కోట్లు వచ్చాయి. అంటే ఇప్పటి వరకు ఈ రెండింటి ద్వారా రూ. 17, 533 కోట్లు ఆదాయం వచ్చినట్లు అబ్కారీ శాఖలు లెక్కలు చెబుతున్నాయి.

## త్వరలోనే రెడ్‌బుక్

# మూడో చాప్టర్

- అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన లోకేశ్
- 'చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కచ్చితంగా సినిమా చూపిస్తాం



**అట్లాంటా-నవభూమిబ్యూరో:** రెడ్‌బుక్‌లో రెండు చాప్టర్లు ఓపెన్ అయ్యాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా అట్లాంటాలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

"చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కచ్చితంగా సినిమా చూపిస్తాం. సందేహం లేదు.. త్వరలోనే రెడ్‌బుక్ మూడో చాప్టర్ కూడా తెరుస్తాం. యువగళం పాదయాత్రలో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. రెడ్‌బుక్‌కు భయపడుతున్న జగన్.. గుడ్‌బుక్ తీసుకొస్తానంటున్నారు. బుక్‌లో ఏమి రాయాలో ఆయనకు అర్థం కావట్లేదు. గతంలో సోషల్‌మీడియాలో పోస్టు పెడితే కేసులు పెట్టి లుకౌట్ నోటీసులు ఇచ్చేవారు. నోటీసులకు భయపడకుండా ఎన్ఆర్ఐలు నిలబడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తాం. రాష్ట్రానికి పెట్టుబడులు కూడా తీసుకెళ్లాలి. సంక్షేమం అంటే ఏమిటో ఎన్టీఆర్ చూపించారు. ప్రపంచంలో తెలుగువారు తలెత్తుకొని తిరిగే పరిస్థితి తీసుకొచ్చారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎప్పుడూ ముందుంటాం. మీరు ఎన్ఆర్ఐలు కాదు.. ఎంఆర్ఐలు అని పిలుస్తా. ఎంఆర్ఐ అంటే 'మోస్ట్ రిలయబుల్ ఇండియన్' అని అర్థం.

## ఏపీలో 'ఉచిత గ్యాస్ సిలిండర్' ప్రారంభం

### స్వయంగా టీ చేసిన సీఎం చంద్రబాబు

**ఇచ్ఛాపురం-నవభూమి:** ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ప్రారంభమైంది. దీపం 2.0లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో సీఎం చంద్రబాబు దీన్ని ప్రారంభించారు. మహిళా లబ్ధిదారు శాంతమ్మ ఇంటికి వెళ్లి ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేశారు. అనంతరం స్వయంగా స్టవ్ వెలిగించి టీ చేసి తాగారు. శాంతమ్మ కుటుంబసభ్యులతో మాట్లాడారు.

అనంతరం మరో లబ్ధిదారు ఇంటికి వెళ్లి ఒంటరి మహిళ పింఛను అందజేశారు. ఆ కుటుంబానికి ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. రేపటి నుంచే పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైంది.. మంత్రి సీతక్క విసుర్లు

**హైదరాబాద్‌-నవభూమి:** బీఆర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైందని పంచాయతీరాజ్ గిరిజన అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క విమర్శలు చేశారు. విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు. అందుకే ఎన్నడు లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40శాతం పెంచారని గుర్తుచేశారు. ఇవాళ(శుక్రవారం) తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మోటిక్ చార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయని.. అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు కేసీఆర్ అధికారంలో ఉండి టాయిలెట్స్ కట్టలేదని..తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సీతక్క అన్నారు.



# కేటీఆర్ పాదయాత్ర

**(1వపేజీ తరువాయి)**అమలుతోపాటు తీసుకున్న నిర్ణయాల్లో పారదర్శకతపై కొట్లాడుతామన్నారు. కాంగ్రెస్ ని మార్చే అవకాశం ఉందా అని అడిగితే నాలుగు సంవత్సరాలు వేచి ఉండాల్సిందే అన్నారు. ఐదు సంవత్సరాల కోసం అవకాశం ఇచ్చారు కాబట్టి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి బిజెపికి వెళ్తారా అని అడిగితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమన్నారు. కాంగ్రెస్ చరిత్ర చూస్తే పరిణామైనా జరగవచ్చు అన్నారు. చెరువుల సంరక్షణపై ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ అసలైన ఎజెండా అవినీతి మాత్రమే అన్నారు కేటీఆర్. మూసి బ్యూటిఫికేషన్కి వ్యతిరేకం కాదన్నారు. కానీ మూసీ ప్రక్షాళణ దేశంలోనే అతిపెద్ది అవినీతి స్కాం అవుతుందన్నారు. హైడ్రా కొందరినే లక్ష్యంగా చేసుకొని పనిచేస్తుంది ఇప్పటిదాకా ఒక్క పెద్ద బిల్డర్ని కూడా ముట్టుకోలేదన్నారు. పేదలు మధ్యతరగతి ప్రజలనే దోచుకున్నదన్నారు.

**సోషల్ మీడియా వారియర్లపై ప్రశంసలు**

ఎన్నికల్లో ఓటమి తర్వాత సామాజిక మాధ్యమాల్లో పార్టీ మద్దతుదారులు యాక్టివ్ అయ్యారన్నారు. ఏం ఆశించకుండానే అద్భుతంగా పని చేస్తున్నారని, ఇంత బలమైన బృందాన్ని కలిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. త్వరలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా, కాంగ్రెస్కు మద్దతుగా వ్యవహరిస్తున్న ప్రధాన మీడియాకి ప్రత్యామ్నాయం సోషల్ మీడియా మాత్రమే అన్నారు.

**పోలీసు వేధింపులపైన హెచ్చరిక**

విధులు మరిచి, చట్ట విరుద్ధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపైన రెచ్చిపోతున్న పోలీస్ అధికారులను గుర్తుపెట్టుకుంటామన్నారు కేటీఆర్. అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వాధినేతలను ప్రసన్నం చేసుకునే పనుల్లో కొందరు పోలీసు అధికారులు బిజీగా ఉండడంతో శాంతి భద్రతలు క్షీణించాయని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రానికి పూర్తిస్థాయి హోంమంత్రి అవసరం ఉందన్నారు. 10 ఏళు అధికారంలో ఉన్నప్పుడు శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించమని తెలిపారు. మతపరమైన హింస వాంఛనీయం కాదన్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో 144 సెక్షన్ విధించడం షాక్కు గురి చేసింది అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ బిజెపి కలిసి పని చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. అనేక అంశాల్లో కుమ్మక్కై పని చేస్తున్న విషయం ప్రజలందరికీ అర్థమవుతుందని అభిప్రాయంపడ్డారు. ఇచ్చిన హామీలను తప్పుతున్న కాంగ్రెస్ లాంటి పార్టీలపైన చర్యలు తీసుకునేందుకు బలమైన ఎన్నికల సంస్కరణలు అవసరమన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లోను జాతీయ పార్టీలను నమ్మొద్దని స్థానిక పార్టీలకు ఓటు వేయాలన్నారు. తమిళనాడు విజయ్ దళపతికి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయపరమైన అంశాల పట్ల విభేదాలే తప్ప తెలుగుదేశం, వైఎస్ఆర్సీపీ అగ్ర నాయకులందరితో మంచి అనుబంధం ఉన్నదన్నారు

ప్రజలే సాధారణ వ్యక్తులను నేతలుగా తయారు చేస్తారని నమ్మకం అన్నారు కేటీఆర్. బిఆర్ఎస్ పార్టీ బలంగా తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉండే అవకాశం వలన నిబద్ధత కలిగిన, బలమైన నూతన నాయకత్వాన్ని తయారు చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. నిజం కన్నా పర్సెప్షన్, పీపుల్ మేనేజ్మెంట్ చాలా ముఖ్యమని ఓటమి నేర్పిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలు ప్రజల్లో అవాస్తవికమైన ఆశల్ని రేకెత్తించాయని, రెండుసార్లు వరుసగా గెలవడంతో యాంటీ ఇన్ కంబెన్సీ కూడా కొంత ప్రభావం చూపిందన్నారు.

**10 స్థానాలకు ఉపఎన్నికలు**

ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో బిజెపి మరొక జుమ్లా చేస్తోందన్నారు కేటీఆర్. తీసుకొచ్చే చట్టం ఎలాంటిదో చూడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం ఇది అసాధ్యం అని తెలిపారు. గ్రూప్ వన్ అభ్యర్థులకు పూర్తి మద్దతు ఉంటుందన్న కెటిఅర్... పార్టీ తరఫున వారికి అండగా ఉంటామన్నారు. యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపైన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి తీసుకువస్తామన్నారు.

# మహారాష్ట్రలో వృద్ధులే కీలకం

**ముంబై-నవభూమి:** మరికొన్ని రోజుల్లోనే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం కోసం పార్టీలు హోరాహోరీగా ప్రయత్నిస్తున్నాయి. అధికార, విపక్షాలన్నీ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. పెద్ద రాష్ట్రం కావడంతో.. ఇక్కడ పాగా వేయాలని ప్రతీ పార్టీ కూడా కత్తులు నూరుతోంది. అధికారమే ధ్యేయంగా సిద్ధం అవుతున్నాయి.

ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం అక్కడి రాష్ట్ర ఓటర్ల లిస్టును ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తంగా 9.7 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 5 కోట్ల మందికి పైగా పురుష ఓటర్లు ఉండగా.. 4.6 కోట్ల మంది మహిళలు ఉన్నారు. వీరిలో రెండు శాతం మంది ఓటర్లు మొదటిసారి ఓటు వేయబోతున్నారు. 18-19 ఏళ్ల వయసు గల తొలి ఓటర్లు 22.22 లక్షల మంది ఉన్నట్లు ఈసీ ప్రకటించింది.

ఇక్కడ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే నాటికి రాష్ట్రంలో 9.63 మంది ఓటర్ల ఉండగా.. ఆ తర్వాత కొత్తగా 6.55 లక్షల మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దాంతో ఆ సంఖ్య 9.7 కోట్లకు చేరుకుంది. ఇక 2019 నాటి ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రంలో 72 లక్షల వరకు ఓటర్ల సంఖ్య పెరిగింది. పుణె జిల్లాలో అత్యధికంగా 88.49 లక్షల మంది ఓటర్లు ఉండగా.. ఆ తర్వాత ముంబయి సబర్బన్‌లో 76.86 లక్షలు ఉన్నారు. ఆ తర్వాత ఠాణెలో 72.29 లక్షలు, నాసిక్‌లో 50.61 లక్షలు, నాగ్‌పూర్‌లో 45.25 లక్షలు, ముంబయి నగరంలో 23.43 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ ప్రకటించింది. అత్యల్పంగా సింధ్‌దుర్గ్‌లో 6.7 లక్షల మంది ఉన్నారు.

ఇక్కడ మరో ఇంట్రస్టింగ్ అంశం ఏంటంటే.. రాష్ట్రంలో మొత్తం 9.7 కోట్ల మంది ఓటర్లు ఉంటే 100 ఏళ్ల వయసు పైబడిన వారు ఏకంగా 47,392 మంది ఓటర్లు ఉండడం గమనార్హం.

వీరంతా మరోసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. కాగా.. వీరిలో ఓ ఓటరు వయసు 109 ఏళ్లు. అత్యంత వృద్ధ ఓటరు కూడా వీరే. కాగా.. మహారాష్ట్రలో 288 స్థానాలకు ఒకే విడతలో ఈనెల 20న పోలింగ్ జరగనుంది. మూడు రోజుల తరువాత ఫలితాలు వెల్లడికానున్నాయి


# ప్రసార భారతి

## ప్రాంతీయ వార్తా విభాగం

## ఆకాశవాణి: విశాఖపట్నం

తేదీ: 01.11.2024

PRESS NOTE - 1

ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్ లేటర్ (Casual Newsreader cum Translator), క్యాజువల్ బ్రాడ్ కాస్ట్ అసిస్టెంట్ (Casual Broadcast Assistant) గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ నియామకాలు శాశ్వత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు కావని, పీఎఫ్, ఆరోగ్య పథకం, క్వార్టర్స్, పెన్షన్ వంటి ప్రయోజనాలు ఉండవని స్పష్టం చేశారు.

క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్ లేటర్ (తెలుగు) నియామకానికి అభ్యర్థులకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతో పాటు, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, ఆంగ్లం నుంచి తెలుగులో తర్జుమా చేయగల నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టీవీ జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు.

అదేవిధంగా క్యాజువల్ బ్రాడ్ కాస్ట్ అసిస్టెంట్ నియామకానికి అభ్యర్థులకు రెడియో ప్రొడక్షన్లో ఏదైనా డిగ్రీ లేదా డిప్లొమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్లో అనుభవం ఉండాలని సూచించారు.

21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి, విశాఖపట్నం ప్రాంతంలో నివసించే వారు అర్హులని అన్నారు. క్యాజువల్ విధానంలో నియమింపబడిన వారికి అసైన్ మెంట్ ప్రాతిపదికన విధుల కేటాయింపు ఉంటుందని, వారికి వార్తా విభాగం అవసరాలకు అనుగుణంగా నెలలో 1 నుంచి 6 వరకూ అసైన్‌మెంట్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

ఆసక్తి, అర్హత కలిగిన జనరల్ క్యాటగిరీ అభ్యర్థులు Rs. 354/-, ఎస్.సి, ఎస్.టి, బి.సి క్యాటగిరీ అభ్యర్థులు Rs.266/- దరఖాస్తు రుసుమును Account Name: Prasara Bharati BCI AIR VSP; Account No: 10428603125; IFSC Code: SBIN0000772; SBI AU Campus Branch బ్యాంక్ అకౌంట్‌కు చెల్లించి, చెల్లింపు రసీదును దరఖాస్తుతో జత చేసి 05.11.2024 లోగా The Head of Office, Akashvani, Siripuram, Visakhapatnam - 530003” చిరునామాకు పంపించాలని కోరారు. దరఖాస్తు కవరు పై భాగంలో “Application for RNU అని తప్పనిసరిగా రాయాలని, వివరాల కోసం 0891-2522020, 9440674057 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

(శ్రీ సాయి వెంపాటి, ఐఐఎస్)
ప్రాంతీయ వార్తా విభాగాధిపతి
ఆకాశవాణి: విజయవాడ


# కురుమూర్తి జాతరకు హైదరాబాద్ నుంచి స్పెషల్ బస్సులు



**హైదరాబాద్‌-నవభూమి:** కురుమూర్తి స్వామి జాతరకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి ఈ స్పెషల్ బస్సులు నడవనున్నాయి. కురుమూర్తి జాతరలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవం ఈ నెల 8వ తేదీన ఉంది. దీంతో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా రోజుల్లో హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను టీజీఎస్ఆర్టీసీ అందుబాటులో ఉంచుతుంది. ఎంజీబీఎస్ - ఆరాంఘర్ మహబూబ్‌నగర్ మీదుగా ఈ బస్సులు జాతరకు వెళ్తాయి. కురుమూర్తి జాతరకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో టీజీఎస్ఆర్టీసీ ముందస్తు రిజర్వేషన్లను కల్పిస్తోంది. టికెట్ల బుకింగ్ కోసం వెబ్‌సైట్ సంప్రదించగలరు. ఈ ప్రత్యేక బస్సులను ఉపయోగించుకుని కురుమూర్తి స్వామిని దర్శించుకోవాలని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం కోరుతోంది.

# మాకిచ్చిన హామీ ఎప్పుడు నెరవేరుస్తారు?..

## పాలకుర్తి ఎమ్మెల్యేకు నిరసన సెగ



**హైదరాబాద్‌-నవభూమి:** పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి నిరసన సెగ తగిలింది. జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నీ తండాలో డబుల్ బెడ్రూం ఇండ్లను శుక్రవారం ఉదయం పరిశీలించేందుకు యశస్విని రెడ్డి వెళ్లారు. ఈ సమయంలో స్థానికులు ఆమెను అడ్డుకున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని స్థానికులు నిలదీశారు. లబ్ధిదారులు ప్రతి ఇంటికి 50వేలు ఇస్తానని ఎన్నికలకు ముందు యశస్విని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట తప్పారు. దీంతో ఆ హామీని ఇంకెప్పుడు నెరవేరుస్తారని నిలదీశారు. మా సమస్యలు పట్టించుకోరా అని ప్రశ్నించారు. ముందుగా తమ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన స్థానికులను కాంగ్రెస్ నాయకులు పక్కకు తోసేశారు. దీంతో ఎమ్మెల్యను కలవనీయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారికి ఎమ్మెల్య యశస్విని రెడ్డి నచ్చజెప్పారు. ఇచ్చిన హామీని వెంటనే నెరవేరుస్తానని చెప్పి.. లబ్ధిదారుల వివరాలను తీసుకుని అక్కడి నుంచి వచ్చేశారు.

# తెలంగాణలో మరో రెండురోజులు వానలే.. ఐఎండీ హెచ్చరిక



**హైదరాబాద్‌-నవభూమి:** తెలంగాణలో రాగల రెండు, మూడురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. రాష్ట్రంలో శుక్రవారం పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాపల్లి, ములుగు, మహమూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్క వానలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఈ నెల 4 వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడుతుందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో మంచిర్యాల, ములుగు, జయశంకర్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డితో పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైంది.

# పునరుత్పాదక ఎకనమిక్ జోన్ల ఏర్పాటు

**(1వపేజీ తరువాయి)**ప్రాజెక్టుల ఏర్పాటులో ఎలక్ట్రోలైజర్లు కీలకంగా మారాయి. ఎలక్ట్రోలైజర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 25శాతం సబ్సిడీ ఇవ్వనుంది. హైడ్రోజన్ ఉత్పత్తి ప్లాంట్ డెవలపర్‌కు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున ప్రోత్సాహం ఇవ్వనుంది. మొదటి 10 గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లకే ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. పోర్టుల వద్ద ఏర్పాటయ్యే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లకు రూ.లక్షకే ఎకరా చొప్పున లీజుకు ఇవ్వనున్నారు. బయో ఇంధనాల ఉత్పత్తి ప్లాంట్లకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

# త్వరలోనే రెడ్‌బుక్ మూడో చాప్టర్

**(1వపేజీ తరువాయి)**ఏపీలో కూటమి గెలుపు ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్క తెలుగువారిది” అని లోకేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు, ఎన్ఆర్ఐ తెదేపా నేత కోమటి జయరాం పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సమయంలో అభిమానులు హెలికాప్టర్ నుంచి పూలవర్షం కురిపించారు.

# ఎన్నికల వేడీ

**(1వపేజీ తరువాయి)**తెలిసిందే. డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో తన ఇంటి సమీపంలోని పోలింగ్ కేంద్రంలో దాదాపు 40 నిమిషాలపాటు క్యూలో నిల్చొని మరీ ఆయన ఓటు వేశారు. అగ్రరాజ్యంలో నవంబరు 5న అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో ఇప్పటివరకు నిర్వహించిన పలు సర్వేల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కంటే.. డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ కాస్త ముందజలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జార్జియా, నార్త్ కరోలినా ప్రాంతాల్లో హారిస్, ట్రంప్‌ల మధ్య గట్టి పోటీ ఉన్నట్లు తాజా సర్వేలు వెల్లడిస్తున్నాయి. జార్జియాలో ట్రంప్‌నకు 48 శాతం, హారిస్‌కు 47శాతం మద్దతుగా ఉన్నారు. ఇక, నార్త్ కరోలినాలో హారిస్‌కు 48 శాతం, ట్రంప్‌నకు 47 శాతం మద్దతుగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. 2008 ఎన్నికల్లో డెమోక్రటిక్ నుంచి అధ్యక్ష రేసులో ఉన్న ఒబామాకు నార్త్ కరోలినా మద్దతిచ్చింది. అయితే, తరువాత ఎన్నికల నుంచి రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతుగా నిలవడం గమనార్హం. జార్జియాలోనూ గత ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నడిచింది. చివరకు కేవలం 1 శాతం మెజార్టీతో 2020 ఎన్నికల్లో బైడెన్ అక్కడ గట్టెక్కారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ గడువు మరోసారి పొడిగింపు?

**(1వపేజీ తరువాయి)**ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లకు సంబంధించిన క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించాల్సి ఉంది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికల ఆధారంగా ఇతర అంశాలపైనా విచారణ జరపాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వపెద్దలను కూడా దర్యాప్తు చేసేందుకు కమిషన్ సిద్ధమవుతోంది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించనుంది. సంబంధిత దస్త్రం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మరో రెండు నెలలపాటు పొడిగింపు ఇస్తూ ఇవాళో.. రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది.

# చినాబ్ వంతెనపై కన్ను

**(1వపేజీ తరువాయి)**తెలుసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వివరాలు ఎందుకు తెలుసుకుం టున్నారనే విషయంపై స్పష్టత లేదు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ రైల్వేవంతెన నిర్మాణం దాదాపు పూర్తయిన విషయం తెలిసిందే. దీని నిర్మాణం పూర్తిచేయడానికి ప్రభుత్వానికి 20 ఏళ్లు పట్టింది. ఇటీవల ఈ వంతెనపై తొలి రైలు ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఈ నిర్మాణాన్ని ఉధంపుర్-శ్రీనగర్- బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. ఇప్పటివరకూ చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. నదీగర్భం నుంచి 359 మీటర్ల ఎత్తున ఉన్న ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు.

# చెన్నూరులో విషాదం.. గోదావరి నదిలో ఇద్దరు యువకులు గల్లంతు

**మంచిర్యాల-నవభూమి:** మంచిర్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఈ విషాదకర సంఘటన చెన్నూరులోని సుందరశాల వద్ద చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# ప్రసార భారతి

## ప్రాంతీయ వార్తా విభాగం

## ఆకాశవాణి: విజయవాడ

తేదీ: 01.11.2024

PRESS NOTE - 2


ఆకాశవాణి విజయవాడ కేంద్రం, ప్రాంతీయ వార్తా విభాగానికి అమరావతి రాజధాని ప్రాంతం, శ్రీసత్యసాయి జిల్లాలో పార్ట్ టైమ్ న్యూస్ కరస్పాండెట్లు (Part Time Correspondent) గా పనిచేసేందుకు ఆసక్తి గల స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. పార్ట్ టైమ్ కరస్పాండెంట్ అనేది కేవలం పార్ట్ టైమ్ అసైన్‌మెంట్ మాత్రమే అని, శాశ్వత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం కాదని, పీఎఫ్, ఆరోగ్య పథకం, క్వార్టర్స్, పెన్షన్ వంటి ప్రయోజనాలు ఉండవని స్పష్టం చేశారు.

జర్నలిజంలో డిగ్రీ లేదా పీజీ డిప్లమా కలిగి రెండు సంవత్సరాల పాత్రికేయ అనుభవం ఉన్న 24 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు వారు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. అభ్యర్థులు జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉండాలని, వారికి ఆకాశవాణి నిబంధనలకు అనుగుణంగా నెలవారీ జీతం చెల్లింపులు ఉంటాయని తెలిపారు.

ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను 08.11.2024 లోగా The Head of Office, Akashvani, Punnamathotha, M.G. Road, Vijayawada - 520010” చిరునామాకు పంపించాలని కోరారు. దరఖాస్తు కవరు పై భాగంలో Application for RNU అని తప్పనిసరిగా రాయాలని, మరిన్ని వివరాల కోసం 9440674057 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

(శ్రీ సాయి వెంపాటి, ఐఐఎస్)
ప్రాంతీయ వార్తా విభాగాధిపతి
ఆకాశవాణి: విజయవాడ

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
శనివారం
1 । నవంబర్ । 2024



## టిమ్ కుక్ దివాళీ విషెస్.. ఢిల్లీ ఫొటోగ్రాఫర్ తీసిన పిక్‌ను షేర్ చేసిన యాపిల్ సీఈవో

**న్యూఢిల్లీ-నవభూమి:** వెలుగుల పండుగ దీపావళిని దేశ ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. కేవలం భారత్‌లోనే కాకుండా విదేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు, విదేశీలు కూడా ఈ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. తమ ఇళ్ల ముందు దీపాలు వెలిగించి.. బాణాసంచా కాలుస్తూ కుటుంబంతో సరదగా సమయాన్ని గడిపారు. ఇక యాపిల్ సీఈవో టిమ్ కుక్ ఈ దీపావళి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ





సందర్భంగా అందమైన దియాస్ పిక్‌ను షేర్ చేశారు. దీపావళిని ఆనందంగా, శాంతియుతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ ఫొటోను రోహిత్ వోహ్రా ఐఫోన్ 16 ప్రో మ్యాక్స్ ద్వారా తీసినదిగా చెప్పుకొచ్చారు. కాగా, రోహిత్ వోహ్రా ఢిల్లీకి చెందిన ఫొటోగ్రాఫర్ ఆయన టిమ్ కుక్ ట్వీట్‌ను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ ఫొటో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## ఈస్టన్ లడాఖ్‌లో ఇండో-చైనా బలగాల కోఆర్డినేటెడ్ పెట్రోలింగ్



**లడాఖ్-నవభూమి:** ఈస్టన్ లడాక్‌లోని డెమ్‌చోక్‌లో రెండు దేశాల బలగాలు.. సహకార పద్ధతిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. భారతీయ ఆర్మీ వర్గాలు ఈ విషయాన్ని శుక్రవారం పేర్కొన్నాయి. త్వరలో దేప్‌సాంగ్ వద్ద కూడా కోఆర్డినేటెడ్ పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈస్టన్ లడాక్‌లోని రెండు ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ బుధవారం ప్రారంభమైంది. 2020 మే నెల నుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్తంగా ఉన్న అన్ని ప్రదేశాల నుంచి ప్రస్తుతం బలగాల ఉపసంహరణ జరిగినట్లు పేర్కొన్నారు.

## రైలు ప్రయాణికులకు అలర్ట్.. నేటి నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు




**దిల్లీ-నవభూమి:** రైలు టికెట్ల అడ్వాన్స్ బుకింగ్‌ను 120 రోజుల నుంచి 60 రోజులకు కుదిస్తూ రైల్వే బోర్డు ఇటీవలే కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కొత్త నిబంధనలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధనల ప్రకారం.. నేటి నుంచి టికెట్లు బుక్ చేసుకోవాలంటే 60 రోజుల లోపు ప్రయాణానికే రైలు టికెట్‌ను ముందుగా బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే, ఇప్పటికే అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకున్న వారికి ఈ కొత్త రూల్స్ వర్తించవు. వారికి 120 రోజుల రిజర్వేషన్ పీరియడ్ వర్తిస్తుంది.కాగా, గతంలో రైల్వే టికెట్లు అడ్వాన్స్ బుకింగ్ 60 రోజులే ఉండేది. 2015 మార్చి 25న దీనిని 120 రోజులకు పెంచారు. 120 రోజుల అడ్వాన్స్ బుకింగ్ వల్ల క్యాన్సలేషన్‌లు ఎక్కువ అవుతున్నాయని, ప్రయాణాలు రద్దు చేసుకోవడం వల్ల బెర్త్‌లు వృథా అవుతున్నాయని రైల్వే బోర్డు తెలిపింది. ప్రస్తుతం అడ్వాన్స్ బుకింగ్‌లో 21 శాతం రద్దు అవుతున్నాయని, 4-5 శాతం మంది ప్రయాణికులు ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నప్పటికీ టికెట్లు క్యాన్సల్ చేసుకోవడం లేదని పేర్కొన్న ది.అసలైన ప్రయాణికులకు టికెట్లు లభించే అవకాశాలను పెంచేందుకు గడువును తగ్గించినట్టు తెలిపింది. అడ్వాన్స్ బుకింగ్‌కు తక్కువ కాల పరిమితి ఉండే తాజ్ ఎక్స్‌ప్రెస్, గోమతి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్ల బుకింగ్‌లో మార్పు లేదని రైల్వే బోర్డు పేర్కొన్నది. విదేశీయులు 365 రోజుల ముందు రైలు టికెట్లు బుక్ చేసుకునే విధానంలోనూ మార్పు లేదని తెలిపింది. ఈ మేరకు గత నెల 16న రైల్వే బోర్డు తన నిర్ణయాన్ని ప్రకటించింది.

## నవంబర్ 3 నుంచి వయనాడ్‌లో మళ్లీ ప్రియాంకా గాంధీ ప్రచారం



**వయనాడ్-నవభూమి:** కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ప్రియాంకా గాంధీ వద్రా వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఉప ఎన్నికల్లో పోటీపడుతున్న విషయం తెలిసిందే. నవంబర్ 3వ తేదీ నుంచి ఆమె ఆ ఎన్నికల ప్రచారంలో తిరిగి పాల్గొననున్నారు. నియోజకవర్గంలో ఆమె పబ్లిక్, కార్నర్ మీటింగ్‌లను నిర్వహించనున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొనున్నారు. 3వ తేదీన 11 గంటలకు మనంతవాది గాంధీ పార్క్ వద్ద రాహుల్, ప్రియాంకాలు పబ్లిక్ మీటింగ్‌లో ప్రసంగించనున్నారు. ఆ తర్వాత మూడు చోట్ల ప్రియాంకా కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నంది. అరీకోడ్‌లో రాహుల్ మరో మీటింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 4వ తేదీన కాల్‌పెట్టా, సుల్తాన్ బాథరే నియోజకవర్గాల్లో ప్రియాంకా కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. 5,6,7 తేదీలకు చెందిన ప్రచార షెడ్యూల్‌ను ఇంకా ప్రకటించలేదు.

## ఆర్థిక సలహా మండలి చైర్మెన్ బిబేక్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి చైర్మెన్ బిబేక్ డెబ్రోయ్ ఇవాళ కన్ను మూశారు. ఆయన వయసు 69 సంవత్సరాలు. పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన బిబేక్ డెబ్రోయ్.. గతంలో పుణెలోని గోఖలే ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ కు ఛాన్సలర్‌గా చేశారు. ఉదర సంబంధిత వ్యాధి వల్ల ఇవాళ ఉదయం ఏడు గంటలకు బిబేక్ డెబ్రోయ్ మృతిచెందినట్లు ఢిల్లీ ఎయిమ్స్ డాక్టర్లు ప్రకటన జారీ చేశారు. బిబేక్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. ఆయనో గొప్ప పండితుడు అని పేర్కొన్నారు. ఆర్థికశాస్త్రం, చరిత్ర, సంస్కృతి, రాజకీయం, ఆధ్యాత్మికత లాంటి భిన్నమైన రంగాల్లో నిష్ణాతుడు అని తెలిపారు. ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పనిచేశారని, ప్రాచీన సాహిత్యంపై వర్క్ చేశారని, దాన్ని నేటితరం యువతకు అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. బిబేక్ డెబ్రోయ్ అత్యద్భుతమైన విద్యావేత్త అని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు.

# ధోనీకి మరీ రూ.4 కోట్లేనా? దీని వెనుక కారణమేంటి..?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ కోసం ఆటగాళ్ల రిటెన్షన్ జాబితా వెలువడింది. ఇందులో చాలావరకు ఊహించినట్లుగానే రిటెన్షన్ ఉన్నాయి. అయితే, ఒకే ఒక్క పాయింట్ మాత్రం అందరినీ ఆశ్చర్య పరిచింది. అది చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని కేవలం రూ.4 కోట్లకే రిటైన్ చేసుకోవడం. మొదటి సీజన్ నుంచే ఐపీఎల్‌కు ఊపు తెచ్చినవారిలో ధోనీ ఒకడు. ఆపై చెన్నై సూపర్ కింగ్స్ కు ఏకంగా రికార్డు స్థాయిలో ఐదుసార్లు టైటిల్ సాధించిపెట్టాడు. మరో ఆరుసార్లు (పుణె సూపర్ జెయింట్స్ సహా) ఫైనల్ కు చేర్చాడు. చెన్నై పునాదే అతడు చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పుడు ఈ స్థాయిలో ఉందంటే దానికి కారణం ధోనీనే. అలాంటి ధోనీని చెన్నై అతడు ఆడినంత కాలం కొనసాగిస్తుందనడంలో సందేహం లేదు. అయితే, ధోనీకి ఇప్పటికే 43 ఏళ్లు. ఫిట్ నెస్ సమస్యలు వేధిస్తున్నాయి. గత ఏడాది ఐపీఎల్ అనంతరం మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఇక వచ్చే సీజన్ కు ధోనీని రిటైన్ చేసుకోవడంపై ఎవరికీ అనుమానాలు లేవు. అయితే, అతడికి ఇచ్చిన ధరను చూస్తేనే ఆశ్చర్యపోవాల్సి వస్తోంది. తొలి సీజన్ కంటే తక్కువ ధరకే.. ఈ నెల మూడో వారంలో జరిగే మెగా వేలానికి ముందుగా ఐదుగురిని అట్టిపెట్టుకున్న చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాలకు రూ.18 కోట్లు, శ్రీలంక పేసర్ మతీశ పతిరనకు రూ.13 కోట్లు, ఆల్ రౌండర్ శివం దూబేకు రూ.12 కోట్లు ఇచ్చింది. కానీ, ధోనీకి రూ.4 కోట్లతో సరిపెట్టింది. ఇది తొలి సీజన్ 2008 నాటి కంటే తక్కువ ధర. దీంతో ఇదేంటని అభిమానులు ఆశ్చర్యపోయారు. అయితే, ధోనీ అన్ క్యాప్డ్ ప్లేయర్. ఆ కారణంగానే చాలా తక్కువ మొత్తానికి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఐదుగురికి రూ.55 కోట్లు ఖర్చుపెట్టిన చెన్నై రూ.65 కోట్లతో మెగా వేలంలోకి అడుగుపెట్టనుంది. ఐదేళ్ల నిబంధనతో.. టీమ్ ఇండియాకు గత ఐదేళ్లలో ప్రాతినిధ్యం వహించని క్రికెటర్ ను, సెంట్రల్ కాంట్రాక్టులో లేని వారినీ అన్ క్యాప్డ్ కేటగిరీగా పరిగణిస్తారు. ఇలాంటివారిని రూ.4 కోటక్లే దక్కించుకునే చాన్సుంది. ఆ అవకాశాన్ని చెన్నై ఉపయోగించుకుంది. ధోనీ 2019 ఆగస్టు 15న అంతర్జాతీయ క్రికెట్ కు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. అంటే.. సరిగ్గా ఈ ఏడాది ఆగస్టు 15కు ఐదేళ్లు పూర్తయ్యాయి. దీంతోనే అన్ క్యాప్డ్ కేటగిరీలోకి వెళ్లిపోయాడు.

# దీపాల నుంచి మంటలు వ్యాపించి.. వ్యాపారవేత్త దంపతులు సజీవ దహనం






**లక్నో:-నవభూమి:** ధనిక కుటుంబంలో దీపావళి పండుగ విషాదం నింపింది. పండుగ నాడు పూజా గదిలో వెలిగించిన దీపాల నుంచి మంటలు చెలరేగాయి. ఆ ఇంటి అంతా వ్యాపించాయి. దీంతో నిద్రలో ఉన్న వ్యాపారవేత్త దంపతుల తోపాటు పనిమనిషి సజీవ దహనమయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. కాకాదేవ్ ప్రాంతానికి చెందిన 48 ఏళ్ల వ్యాపారవేత్త సంజయ్ శ్యామ్ దాసాని కుటుంబానికి అంబాజీ ఫుడ్స్, బిస్కెట్ల తయారీ పరిశ్రమలు వంటి వ్యాపారాలున్నాయి.%కాగా, పాండు నగర్‌లోని మూడు అంతస్తుల భవనంలో నివసించే సంజయ్ శ్యామ్ దాసాని, 42 ఏళ్ల భార్య కనికా గురువారం దీపావళి సందర్భంగా ఇంటిలోని పూజా మండపంలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. రాత్రి భోజనం తర్వాత ఆ దంపతులు నిద్రించారు. అయితే పూజా గదిలోని వెలుగుతున్న దీపాల నుంచి మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. దీంతో వ్యాపారవేత్త సంజయ్ శ్యామ్ దాసాని, ఆయన భార్య కనికా దాసానితో ఆ ఇంట్లో ఉన్న 24 ఏళ్ల పనిమనిషి సజీవ దహనమయ్యారు.మరోవైపు స్నేహితులతో కలిసి దీపావళి వేడుక జరుపుకున్న కుమారుడు హర్ష్ దాసాని, అర్ధరాత్రి తర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో మంటలు, పొగలు గమనించి ఫైర్ కంట్రోల్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. వ్యాపారవేత్త సంజయ్ శ్యామ్ దాసాని, ఆయన భార్య కనికా దాసానితోపాటు ఆ ఇంట్లో ఉన్న పనిమనిషి కూడా మంటల్లో కాలి మరణించినట్లు గుర్తించారు. అయితే వ్యాపారవేత్త ఇంట్లో వుడ్ ఫర్నీచర్ ఎక్కువగా ఉండటంతో బెడ్‌రూమ్, బాల్కనీ ప్రాంతాలకు మంటలు వేగంగా వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఆటోమేటిక్ డోర్ లాక్ పడటంతో లోపలున్న వారు బయటకు రాలేక మంటల్లో చిక్కుకుని సజీవ దహనమైనట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నెంబర్ 28... ట్రంప్ పై స్విస్ మోడల్ లిప్ కిస్ ఆరోపణలు!



**న్యూఢిల్లీ-నవభూమి:** నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో డొనాల్డ్ ట్రంప్ పై వస్తోన్న మిగిలిన ఆరోపణలు, విమర్శలన్నీ ఒకెత్తు అయితే... లైంగిక వేధింపులకు సంబంధించి వస్తోన్న ఆరోపణలు మరొకెత్తు అన్నట్లుగా ఉందనే అనుకోవాలి! ఈ నేపథ్యంలో తాజాగా ఓ స్విస్ మోడల్ నుంచి ట్రంప్ పై సంచలన ఆరోపణలు వచ్చాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పై ఇప్పటికే పలు లైంగిక ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నెపథ్యంలో తాజాగా మరో సరికొత్త ఆరోపణ తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా.. 1993లో మాజీ మిస్ స్విట్జర్లాండ్ బీట్రైస్ కీల్ సంచలన ఆరోపణలు చేశారు. డొనాల్డ్ ట్రంప్ తనను అనుచితంగా తాకి, పెదాలపై ముద్దుపెట్టారని ఆమె ఆరోపించింది. "ప్రైవేట్ టాక్" అనే నెపంతో న్యూయార్క్ లోని ప్లాజా హోటల్ లో డొనాల్డ్ ట్రంప్ సూట్ కు తనను ఆహ్వానించినట్లు బీట్రైస్ కీల్ పేర్కొంది. ఈ సమయంలో ట్రంప్ తనపైకి దూకి.. తనను గట్టిగా పట్టుకున్నాడని.. తన సమ్మతి లేకుండా.. పెదవులు, మెడపై ముద్దు పెట్టుకున్నాడని ఆమె తెలిపింది! ఈ సమయంలో యూఎస్ లో ఆమె ప్లాన్స్ గురించి అడిగిన ట్రంప్... న్యూయార్క్ యూనివర్శిటీలో ఆమె ప్లేస్ మెంట్ పొందడంలో సహాయపడటానికి ఆఫర్ ఇచ్చాడని చెబుతున్నారు. అయితే.. ఆ సమయంలో వారం రోజుల్లో అందాల పోటీలు ఉండటంతో ఈ విషయాన్ని ఎవరికీ వెల్లడించలేదని ఆమె చెబుతున్నారు! వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ భర్త డౌగ్ ఎం హెూఫ్ చుట్టూ ఉన్న వివాదాల నుంచి దృష్టిని మళ్లించడానికే వ్యూహాత్మకంగా ఈ విషయాలు తెరపైకి తెస్తున్నారని.. ఇవి పూర్తిగా తప్పుడు ఆరోపణలని తోసి పుచ్చారు.. ట్రంప్ నేషనల్ ప్రెస్ సెక్రటరీ కరోలీన్ లీవిట్! కాగా.. అమెరికా మజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పై ఇలంటి ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. ఇప్పటివరకూ 27 మంది మహిళలు అతనిపై రకరకాల లైంగిక దుష్ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు చేశారు. ఈ జాబితాలో తాజాగా ఈ స్విస్ మోడల్ కీల్ కూడా చేరారు!

# చీనాబ్ బ్రిడ్జ్‌పై కన్నేసిన పాక్.. చైనా కోరిక మేరకు సమాచార సేకరణ



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జ్ ను జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆ రాష్ట్రంలోని రియాసీ జిల్లాలో చీనాబ్ నదిపై ఈ బ్రిడ్జ్‌ను నిర్మిస్తున్నారు. అయితే, ఈ ఎత్తైన వంతెనపై పొరుగు దేశం పాకిస్థాన్ కన్నుపడినట్లు తెలుస్తోంది. బ్రిడ్జ్‌కు సంబంధించిన సమాచారాన్ని పాక్ సేకరిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం వచ్చినట్లు జాతీయ మీడియా పేర్కొంది. చైనా కోరిక మేరకు పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వర్గాలు వంతెనకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సదరు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఆ వివరాలు ఎందుకు తెలుసుకుంటున్నారనే విషయంపై మాత్రం స్పష్టత లేదు.

కాగా, చీనాబ్ రైలు వంతెనను భారతీయ రైల్వే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఉక్కు, కాంక్రీట్‌తో నిర్మించిన ఈ వంతెన జమ్మూ కశ్మీర్‌లోని జమ్మూ డివిజన్ రియాసి జిల్లా బక్కల్ - కౌరీ మధ్య ఉంది. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా చీనాబ్ వంతెనను నిర్మించారు. నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తున చీనాబ్ నదిపై 1,315 మీడర్ల పొడవైన వంతెనను నిర్మించారు. చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుపై ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. ఇక పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం.ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఈ రైల్వే వంతెన నిర్మాణం దాదాపు పూర్తైంది. దీని నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి 20 ఏళ్లు పట్టింది. ఈ చారిత్రక వంతెనపై ఈ ఏడాది జూన్ 20న తొలి రైలు ట్రయల్ రన్‌ను కూడా విజయవంతంగా నిర్వహించారు. తద్వారా కశ్మీర్‌లోని రియాసి నుండి బారాముల్లా వరకు రైలు సేవల ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. త్వరలో ఈ వంతెన రైలు సేవలకు అందుబాటులోకి రానుంది.

## పట్టించుకోని ప్రజలు.. పటాకుల మోతతో ఢిల్లీని కమ్మేసిన పొగ

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత మరింత దిగజారింది. దీపావళి సందర్భంగా హస్తిన వాసులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించి మరీ పటాకులు కాల్చారు. దీంతో తీవ్రమైన శబ్దకాలుష్యంతోపాటు గాలి నాణ్యత కూడా పడిపోయింది. శుక్రవారం ఉదయం దట్టమైన పొగ కమ్మేసింది. ఎదురుగా ఉన్న వాహనాలు కూడా కన్పించలేనంత పరిస్థితి నెకొన్నది. చాలా ప్రాంతాల్లో ఎయిల్ క్వాలిటీ ఇండెక్స్ 350 పాయింట్లు దాటేసింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.ఉదయం 6 గంటలకు ఢిల్లీలోని ఆనంద్ విహార్, ఆర్కే పురం ప్రాంతంలో గాలి నాణ్యత సూచి (%ూు×%) 395 పాయింట్లకు చేరుకున్నది. దీంతో పరిస్థితిని 'తీవ్రంగా' పేర్కొన్నారు. అలాగే బురారీ, సోనియా విహార్, పంజాబీ బాగ్, నార్త్ క్యాంపస్, బవానా, జహంగీర్‌పురి, రోహిణి, అశోక్ విహార్, నెహ్రూ నగర్‌లో సూచీ 350 పాయింట్లకు పైనే ఉండటం గమనార్హం. గజియాబాద్, గురుగ్రామ్, నోయిడాలో కూడా ఇలాంటి పరిస్థితే ఉన్నది. గురువారం అర్ధరాత్రి నుంచి ఏక్యూఐ పడిపోతూ వచ్చింది.ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా వాయుకాలుష్యం తీవ్ర సమస్యగా మారుతుంది. పెద్ద మొత్తంలో పటాకులు కాల్చడం వల్ల గాలిలో హానికరమైన రసాయనాలు పెరుగుతాయి. దీని వల్ల కాలుష్యం అనేక రెట్లు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏటా ఢిల్లీలో పటాకుల తయారీ, అమ్మకాలు, వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధిస్తూ వస్తున్నది. ఇసారీ పటాకులను ప్రభుత్వం బ్యాన్ చేసింది. అయినా ప్రజలు ఆంక్షలు పట్టించుకోకుండా పటాకులు పెద్దమొత్తంలో కాల్చడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయింది. దీంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారు.ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

# లేహ్‌లో తొలిసారిగా అనలాగ్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో.. ఇక్కడ ఏం చేస్తారంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తొలి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లద్దాఖ్ లేహ్‌లో ప్రారంభించింది. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లదఖ్ విశ్వవిద్యాలయం, ఐఐటీ బాంబే, లదఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో ఈ మిషన్ చేపట్టింది. మిషన్‌లో భాగంగా ఇస్రో లేహ్‌లో ఓ స్పేస్‌ను సృష్టిస్తుంది. ఇందులో మరో గ్రహంలో పరిస్థితులు ఎలా ఉంటాయో అలాగే ఉంటాయి. దాంతో భూమికి దూరంగా ఉన్న ప్రదేశాల్లోని బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇస్రో సవాళ్లను చేయనున్నది.ఇస్రో లేహ్‌లో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ మిషన్ ఇదే. అంతరిక్షం, ఏదైనా ఖగోళ వస్తువు తరహాలో వాతావరణం, పర్యావరణాన్ని పోలి ఉంటుంది. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దుతుంటారు. అందులో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టనున్న విషయం తెలిసిందే. ఇందులో కీలకమైన మిషన్ గగన్‌యాన్. ఇందులో మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపబోతున్నది.ఈ పరిస్థితుల్లో అనలాగ్ మిషన్ కీలకంగా మారనున్నది. రాబోయే కాలంలో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. లద్దాఖ్‌లోని వాతావరణ పరిస్థితులు కొంత వరకు చంద్రుడు, మార్స్ పరిస్థితులను పోలి ఉంటాయి. చల్లని, పొడి వాతావరణం, ఎక్కువ ఎత్తు ఉండడంతో ఇక్కడి నుంచి దీర్ఘకాలిక అంతరిక్ష మిషన్ల కోసం సన్నాహాలకు ఉపయుక్తంగా ఉండనున్నది. అనలాగ్ మిషన్‌లో పాల్గొనేవారంతా ఇతర గ్రహాలు, స్పేస్‌షిప్‌ల్లో ఉండే పరిస్థితులు అనుభవిస్తారు. భవిష్యత్‌లో ఇక్కడే అంతరిక్ష యాత్రకు సిద్ధం కానున్నారు. నిర్వహణ, మానసిక స్థితిని సైతం శాస్త్రవేత్తలు పర్యవేక్షించనున్నారు.

## కారు ఆపలేదంటూ.. అద్దాలు పగలకొట్టి..



బెంగళూరు-నవభూమి: రహదారిపై కారు ఆపమంటే.. ఆపలేదంటూ ఓ వ్యక్తి ఆగ్రహించాడు. దీంతో ఆ కారును మరొకరి బైక్‌పై వెంబడించాడు. అనంతరం రహదారిపై కారుకు బైక్ అడ్డంగా నిలిపారు. అనంతరం కారు దిగాలంటూ కారు డ్రైవింగ్ చేస్తున్న అనూప్ జోసఫ్‌ను డిమాండ్ చేశాడు. అందుకు అతడు ససేమీరా అనడంతో.. సదరు వ్యక్తి కోపం కట్టలు తెంచుకుంది. అంతే కారు అద్దాన్ని రాయితో బలంగా కొట్టాడు. దీంతో కారు కిటికి అద్దం పగిలింది. ఆ గాజు పెంకులు కారు వెనుక సీట్లో కూర్చున్న అనూప్ కుమారుడి తలకు తగిలి.. తీవ్ర గాయమైంది. దాంతో ఆ బాలుడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బాలుడి తలకు మూడు కుట్లు పడ్డాయి.అయితే ఈ దాడి ఘటనకు సంబంధించిన మొత్తం వ్యవహారాన్నిఅనూప్ భార్య తన సెల్ ఫోన్‌లో చిత్రీకరించింది. అందుకు సంబంధించిన వీడియోను.. పోలీసులకు ట్యాగ్ చేసి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో పోలీసులు వెంటనే స్పందించారు. ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వీడియోలోని వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీపావళి సందర్భంగా బుధవారం రాత్రి షాపింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుందని అనూప్ జోసఫ్ పోలీసులకు వెల్లడించారు.

## భారత్-జర్మనీ హరిత భాగస్వామ్యం

జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ ఈ నెల 25, 26, 27 తేదీలలో భారత్‌లో పర్యటించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలను సమగ్రంగా పెంపొందించుకునే లక్ష్యంతో విస్తృత చర్చలు జరిపారు. ఆసియా%-%పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ 2024 సదస్సును ఇరువురూ సంయుక్తంగా ప్రారంభించారు. 7వ ఇండో%-%జర్మన్ కన్సల్టేషన్స్‌ను ఆరంభించారు. ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ నాయకత్వంలో జర్మన్ కేబినెట్ ఈ నెల 16న సమున్నత ఆశయాలు, లక్ష్యాలతో కూడిన 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహాన్ని ఆమోదించింది. ఇది భారత్%-%జర్మనీ సంబంధాలలో గుణాత్మక మార్పులకు దోహదం చేయగలదనే ఆశాభావం ఇరు దేశాలలోనూ వ్యక్తమవుతోంది. భారత్%-%జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 25 సంవత్సరాలు పూర్తవుతాయని, రాబోయే 25 ఏళ్లలో ఈ భాగస్వామ్యం మరిన్ని శిఖరాలను అధిరోహించి, మరింత ఔన్నత్యాన్ని సంతరించుకోగలదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు శక్తిమంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ శ్రేయస్సుకు పరస్పరం ఎలా సహకరించుకోగలవో 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహ ప్రణాళిక విశదం చేస్తుందని ఆయన అన్నారు. ధరిత్రి జీవ వైవిధ్యాన్ని, వాతావరణాన్ని సంరక్షించడంలోను ఐక్యరాజ్యసమితి 2020 ఎజెండా నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పరిపూర్తిలోను భారత్ ఒక కీలక పాత్ర నిర్వహించిందని 'ఫోకస్ ఆన్ ఇండియా' వ్యూహ ప్రణాళిక మున్నుడి పేర్కొన్నది. అంతర్జాతీయ న్యాయ నియమాలు, శాసనవిహిత అంతర్జాతీయ వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న ప్రాంతంలో భారత్ ఒక స్థిరీకృత శక్తిగా ఉన్నదని ఆ వ్యూహ పత్రం పేర్కొంది. జర్మనీకి భారత్ నిపుణ కార్మికశక్తిని విశేష స్థాయిలో సమకూర్చుతుందని కూడా 'ఫోకస్ ఆన్ ఇండియా' ప్రశంసించింది. భారత్%-%జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో, 2022లో ఇరుదేశాలు ఆమోదించిన భారత్%-%జర్మనీ హరిత, సుస్థిరాభివృద్ధి భాగస్వామ్యం ఒక ప్రధాన అంతర్భాగంగా ఉన్నది. ఈ హరిత భాగస్వామ్యంలో భాగంగా భారత్‌లో ఇంధన పరివర్తనకు గాను జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యు బ్యాంక్ 100 కోట్ల యూరోల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఫోటోవోల్టాయిక్ సిస్టమ్స్, పవర్ లైన్స్, ఓపెన్ స్పేస్ ఫెసిలిటీస్‌ను అభివృద్ధిపరిచేందుకు ఈ నిధులను మదుపు చేశారు. ఈ హరిత భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే లక్ష్యంతో ఇటీవల గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'రి%-%ఇన్వెస్ట్' పునరుద్ధరణీయ ఇంధన మదుపుదారుల సమావేశం నొకదాన్ని నిర్వహించారు. జర్మనీతో సహా పలుదేశాల ఉన్నత స్థాయి రాజకీయ, పారిశ్రామిక ప్రతినిధులు ఆ సదస్సులో పాల్గొన్నారు. 'భారత్ ఒక అభివృద్ధి చెందుతున్న దేశమే అయినప్పటికీ తొమ్మిదేళ్ల క్రితం పారిస్ వాతావరణ సదస్సు నిర్దేశించిన వాతావరణ పరిరక్షణ లక్ష్యాల పరిపూర్తిలో ముందంజలో ఉందని' ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన ప్రారంభోపన్యాసంలో అన్నారు. హరిత పరివర్తనను ఒక ప్రజా ఉద్యమంగా భారత్ పరిగణిస్తుందని అంటూ పిఎమ్ సూర్యఘర్ మఫ్త్ బిజలి యోజనతో భారత్‌లో ప్రతి గృహమూ ఒక విద్యుత్ ఉత్పత్తిదారుగా రూపొందనున్నదని నరేంద్ర మోదీ అన్నారు. 'ఇంధన పరివర్తన లక్ష్యాలను భారత్ సాధించగలిగితే అంతిమంగా సమస్త ప్రపంచమూ లబ్ధి పొందుతుందని జర్మన్ ప్రభుత్వ ఆర్థిక సహకార మంత్రి స్వెన్జ షుల్జె అన్నారు. 140 కోట్ల మందికి పైగా ఉన్న భారతీయులు తమ విద్యుత్ అవసరాలను పవన, సౌరశక్తి నుంచి సమకూర్చుకోగలిగినప్పుడే వాతావరణ మార్పు సంక్షోభం నిలిచిపోగలదని జర్మన్ మంత్రి అన్నారు.

భారత్%-%జర్మనీ హరిత భాగస్వామ్యంలో భాగంగా వాతావరణ మార్పు సంబంధిత అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక పాలనా సంస్థలు, మరీ ముఖ్యంగా పౌర సమాజ సంస్థలతో ప్రభావశీల, పారదర్శక చర్చలు జరపవలసిన అవసరమున్నది. శిలాజ ఇంధనాల వినియోగం వల్ల వాతావరణ సంక్షోభం ఏర్పడుతున్న నేపథ్యంలో ఇంధన వినియోగంలో మౌలిక మార్పులు రావలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆ మార్పులు కర్బన ఉద్గారాలు సాధ్యమైనంత తక్కువ స్థాయిలో ఉండేందుకు తప్పక దోహదం చేయాలి. ఇందుకు అనేక రంగాలలో ముఖ్యంగా ఇంధన ఉత్పత్తి, చలనశీలత, ఆహారోత్పత్తి, చిన్న పరిశ్రమలు, గృహ అవసరాలకు ఇంధన వినియోగం, మరీ ముఖ్యంగా జీవనశైలీ రీతుల్లోను మౌలిక మార్పులు సాధించవలసిన అవసరమున్నది. ఇంధన వ్యవస్థల పరివర్తనలో పౌరులు చొరవతో కీలకపాత్ర వహించడం చాలా ముఖ్యం. పునరుద్ధరణీయ ఇంధన ఉత్పత్తిలో ప్రపంచంలో చైనా ప్రథమ స్థానంలో ఉండగా జర్మనీ ద్వితీయ స్థానంలో ఉన్నది. భారత్ ఈ విషయంలో జర్మనీకి దరిదాపుల్లో ఉన్నది. అయితే జర్మన్ విద్యుత్ వినియోగదారులు ప్రొజ్యూమర్స్ (ఇంధన వినియోగదారులే ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకునేవారుగా ఉండడం)గా పరిణమించడం అంతకంతకూ అధికమవుతోంది. అంతే కాదు సమష్టిగా ఇంధనాన్ని ఉత్పత్తి చేసుకునే కార్యకలాపాలలో భాగస్వాములు అవుతున్నారు. జర్మనీలో ఇప్పుడు 847 ఇంధన సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 2,20,000 మంది పౌరులు భాగస్వాములుగా ఉన్నారు. ఈ ఇంధన సహకార సంఘాలలో 80 శాతానికి పైగా ఫోటో వొల్టాయిక్ వ్యవస్థలను నిర్వహిస్తున్నారు


# విలువలు లేకుంటే మనుగడ ప్రశ్నార్థకం!



నేటి సమాజంలో విలువలంటే స్పష్టత లేకుండా పోతోంది. సృష్టిలో దేనికుండే విలువ దానికి ఉన్నా, గుర్తింపు లేకుండా, ముఖ్యత లేకుండా ఉంటాన విలువల సంక్షోభం ఏర్పడుతోంది. ఇదే పోకడ ముదిరితే మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ మేరకు విలువల గూర్చి వివరించే నా ఈ చిన్న ప్రయత్నం, దయచేసి వాస్తవాలను పరిశీలించాలని మనవి.

వ్యక్తిని మనిషిగా చేసేదే విలువలు, గుర్తింపు స్థిరత్వం తెచ్చేవే విలువలు. సమాజంను అదుపులో పెట్టేవే విలువలు. ఏది ముఖ్యం, ఏది ముఖ్యం కాదు, ఏది అవసరం, ఏది అవసరం కాదు, ఏది కోరదగినది, ఏది కోరదగనిది అనే భావాలను స్పష్టంగా వివరించేవే విలువలు. క్లుప్తంగా చెప్పాలంటే, విలువలు ఆయా పనులను, జీవితాలను రాణింపజేస్తాయి. ఏది కరెక్ట్, ఏది తప్పు, ఏది ముఖ్యం, ఏది అవసరము అనేవి చెప్పే ప్రమేయాలే విలువలు. మనిషిని మానవునిగా చేసేదే విలువలు. మనకు దేని అవసరత ఉంటే,దానికి విలువ ఇస్తుంటాం, ఇది సహజం. శైశవ దశలో చిన్నారికి పాలసీసా, బాల్యంలో ఆట వస్తువులు, తదుపరి దశలో స్నేహితులు విలువైనవిగా ఉంటాయి. మనకు ఏది అవసరం? ఏది కావాలో? దాని విలువే నిర్ణయిస్తుంది. దానిని బట్టే మన ప్రవర్తన ఉంటుంది. ఉదా! తీవ్రమైన వేసవి, నీటి ఎద్దడిలో మంచినీరు లభ్యత లేని సమయంలో ఒక బాటిల్ లోనే మంచినీరు ఉంటే కొద్దికొద్దిగా త్రాగుతూ పొదుపుగా జాగ్రత్తగా కాపాడుకుంటాము. ఇక్కడ నీటి విలువ తెలుస్తుంది. పేదవాని భోజనం ఎప్పుడు రుచిగానే ఉంటుంది. కారణం ఆకలి అనే విలువ దానికి రుచిని కలిగిస్తుంది. అలాగే ఆయా జీవిత అనుభవాలతో ఆహారం విలువ తెలుసుకున్న వారు ఆహారాన్ని స్వీకరించే సమయంలో శుభ్రంగా, పళ్లెంలో ఒక్క మెతుకు కూడా మిగిల్చకుండా శుభ్రంగా భోం చేస్తారు. ఎందుకంటే వారికి అన్నం విలువ తెలుసు గనుక.

దీనికి విరుద్ధంగా, ఆహారం విలువ తెలియని వారు భుజించే సమయంలో నిర్లక్ష్యంగా తినటం, కింద పడేయటం, పళ్లెంలో మిగిల్చివేయడం వంటివి గమనించవచ్చు. మరో ఉదాహరణ: ఎవరైనా ఎలాగైనా తన జీవిత లక్ష్యమైన సివిల్స్ సాధించాలి అనుకుంటే పుస్తకాలకు, చదువుకు, సమయానికి విలువ ఇవ్వాల్సిందే కదా!అందుకే విలువలనేవి మనం సాధించుకోవాలనే వాటికి మనం ఏర్పాటు చేసుకునే ఆదర్శాలుగా ఉండాలి. వ్యక్తిని పరిపూర్ణ మనిషిగా చేసేవే విలువలు. విలువలను కలిగి ఉంటూ విలువలతో ప్రవర్తించే వ్యక్తి ఇతరులకు ఆదర్శంగా ఉండిపోతారు. దీనికి ఉదాహరణ స్వర్గీయ రతన్ టాటా, గతంలో స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి గార్లు. ఇక్కడ విద్య గూర్చి ఆలోచించాల్సి ఉంటుంది. ఎందుకంటే, విద్యకు విలువలకు మధ్య వివరించలేని బంధం ఉంటుంది. ప్రవర్తనలో మార్పు విద్య ద్వారా గమనించబడితే విలువలను ఆపాదించటమే అవుతుంది. అందుకే విద్య విలువలను ఇచ్చేదిగా విలువలను పెంచేదిగా ఉండాలి.దీనికి కొన్ని




ఉదాహరణలు గమనించండి. ట్రాఫిక్ లో జంక్షన్ లో రెడ్ సిగ్నల్ పడితే, ట్రాఫిక్ పోలీసు లేకున్నా, ట్రాఫిక్ లేకున్న,గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు నిబద్ధతతో వేచి ఉండటం, వ్యక్తిత్వ విలువను తెలుపుతుంది. లోకల్ బస్ / రైలులో ప్రయాణించే సమయంలో, ఎవరో ముదుసలి వారు ప్రవేశించినప్పుడు లేచి వారికి సీటు ఆఫర్ చేయడం. ఏదో ఒక ప్రాంతంలో ఆకతాయిలు చేస్తున్న అసాంఘిక చర్యలను గమనిస్తూ, నాకెందుకులే అనుకోకుండా, వెంటనే 100 కు ఫోన్ చేయడం. రోడ్డుపై అరటి తొక్క పడి ఉంటే, ఆ తొక్కను తీసి ప్రక్క చెత్తబుట్టలో వేయడం ఇలాంటి సత్ క్రియలన్నీ విలువలను ప్రతిబింబిస్తాయి. విలువలు విలువలనే కలిగిస్తాయి, వాటికి అవే సాటి! విలువలు పలు రకాలుగా ఉన్నా, అన్నింటిలో వ్యక్తిగత విలువలనేవి ముఖ్యం, ఇవి లోపించడంతోనే సమాజంలో చూడకూడనివి చూడడం, వినకూడనివి వినడం జరుగుతోంది. చాల విచారం. అందుకే విలువలాధారిత విద్య విధిగా సమాజంలో చోటు చేసుకోవాలి. విలువలు లేని విద్యతో ప్రయోజనం లేదు. ఏది చేస్తే ఇతరులకు ఉపయోగకరంగా ఉంటుందో, అర్థవంతంగా ఉంటుందో, ఆదర్శంగా ఉంటాయో అవే విలువలకు నిదర్శనాలు. వ్యక్తి తాను పాటించే ప్రవర్తనను బట్టి విలువలు నిర్ధారితమవుతుంటాయి. విలువలను కలిగి ఉంటే ఉత్తమ మూర్తి మత్వంతో ఆదర్శంగా కనిపిస్తుంటారు. ఇలాంటివారు ప్రస్తుత సమాజానికి తక్షణ అవసరం. విలువలనేవి శారీరకమైనవీ, మానసికమైనవీ, వ్యక్తిగతమైనవీ, వృత్తిపరమైనవీ, ఇలా ఏవైనా కావచ్చు.విలువలు వ్యక్తిని సరైన మార్గాన్ని ఎంచుకునేలా నిర్దేశకాలుగా సహాయపడుతుంటాయి. ఈ విలువలు పెంపొందించబడాలంటే కుటుంబ పెద్దలు, తల్లిదండ్రులు, గురువులు అందరూ అవి పెంపొందించబడేలా కృషి చేయాలి. అందుకు వారు విలువలను కలిగి ప్రవర్తిస్తూ మాదిరిగా ఉండాలి. విద్యతో పాటు విలువలు సైతం విధిగా పెంపొందించబడాలి. విద్య విలువలను ఇచ్చేలా, పెంచేలా గుణాత్మకంగా ఉండాలి. అప్పుడే విద్యకు గుర్తింపు లభిస్తూ, సంస్కారం గోచరిస్తుంది. ముఖ్యమైన వ్యక్తిగత విలువల గూర్చి క్లుప్తంగా తెలుసుకుంటే %-

%1. పరిశుభ్రత – శుభ్రత, స్వచ్చత అనేవి మనం చేసే ఆలోచనల్లో, పాటించే ఆచరణలో, క్రియల్లో కనిపించాలి, చెడు( మురికి ) ను దూరంగా ఉంచేది. పరిశుభ్రతను కలిగి ఉండటం విలువను సూచిస్తుంది.

2. నిబద్ధత – అన్ని వ్యవహారాలలో, నిక్కచ్చిగా, న్యాయంగా వ్యవహరిస్తూ ఇచ్చిన మాటను తప్పకుండా దానికి కట్టుబడి ఉండటం విలువను సూచిస్తుంది.

3. ఉదారత – అవసరతలో ఉన్నవారికి, కష్టంలో ఉన్నవారికి సహాయం చేయడం, వారికి సమయాన్ని కేటాయించడం విలువకు తార్కాణం.

4. నిజాయితీ – నైతికత కలిగి ఉంటూ, చిత్తశుద్ధితో, అంకిత భావంతో ఆయా పనులను, విధులను రుజు ప్రవర్తనతో చేయడం.

5. సమయపాలన – నిర్దేశిత సమయానికి అనుగుణంగా ప్రవర్తించడం సమయపాలనకు కట్టుబడి ఉండే గుణం, అలవాటు గొప్ప విలువలను చూపుతుంటాయి.

6. సహనం – ఓపికతో ప్రవర్తిస్తూ, నిదానమే ప్రధానంగా భావిస్తూ ఇతరుల నమ్మకాలను లేదా ఆచరణలకు గుర్తింపు ఇస్తూ సమ్మతించడం చక్కని విలువలను చూపుతుంది.

7. గౌరవనీయత – ఇది ఇచ్చు పుచ్చుకునే ధోరణి పెంపొందింపజేస్తుంది గౌరవభావాలను ఆత్మీయతను పెంచుతుంది. ఇతరుల అభిప్రాయాల పట్ల మర్యాదగా, ఆదరణతో ప్రవర్తించడం గౌరవనీయతతో కూడిన ఘనత లభింపజేస్తుంది.

8. నమ్రత – తగ్గించుకునే ధోరణితో, తగ్గింపు స్వభావంతో, ఇతరుల వద్ద అనుకువ కలిగి ప్రవర్తించడం. ఇక్కడ వినయం, విధేయతలే విజయాలకు మెట్లు అని గ్రహించాలి.

9. సమానత్వం – అందరినీ సమాన దృష్టితో చూస్తూ, తధానుభూతి ప్రవర్తన కలిగి ఉండటం.

10. దయాగుణం – సహృదయత, మానవీయత, సానుభూతి, ప్రేమ, గుణాలను కలిగి ఉండటం.

ఇవన్నీ విలువలకు తార్కాణాలుగా ఉంటూ అర్థాన్ని కలిగిస్తూ ఆదర్శంగా నిలుస్తుంటాయి. అంతేకాకుండా తప్పు ఒప్పులను వర్గీకరిస్తూ ఆచరణలో దిశానిర్దేశం చేస్తూ ఆలోచనలకు ఆదరణ ఇస్తూ ఆయా చర్యలకు ప్రేరేపిస్తాయి. ఇక, అతి నిద్ర, సోమరితనం, భయం, కోపం, అసూయ, ఈర్ష్య, పనులను చేయకుండా తప్పించుకు తిరగడం ఈ ఏడు దోషాలు వ్యక్తి విలువలను నిలువునా హరిస్తాయి. అయితే, సత్యం, దానం, సహనం, శాంతం, ధైర్యం, పనిచేసే తత్వం, ఎలాగైనా లక్ష్యాన్ని సాధించాలనే కృషి, తపన ఈ ఏడు గుణాలు వ్యక్తి విలువలను పెంపొందిస్తాయి. అందుకే, చదువే కాదు, చదువుతోపాటు సంస్కారం నేర్పించాలి. అప్పుడే సదరు విద్యకు గుర్తింపు లభిస్తుంది. జీవితానికి సార్థకత చేకూరుతుంది. విద్య విలువలను ఇచ్చేదిగా, పెంచేదిగా ఉండాలి. దీనికై తల్లిదండ్రులు, పెద్దలు, టీచర్లు, సకల వ్యవస్థ ఉమ్మడిగా కృషి జరపాలి. అప్పుడే విలువల సంక్షోభం సమసిపోతూ నవ సమాజం గమనించబడుతుంది.

డాక్టర్ ప్రభుదయాల్
మాజీ సెనేట్ మెంబర్, కాకతీయ యూనివర్సిటీ
జీవిత సభ్యుడు, ఐఏటీఈ
మండల విద్యాశాఖాధికారి – కొత్తగూడెం


# కరువును తరమడం ఎలా ?



కరువులు దేశాభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. అడవుల నిర్మూలన, కరువు, వాతావరణం ప్రతికూలతలు, మానవుని చర్యల వలన సారవంతమైన భూమి బంజరుభూమి అంటే ఏ పంటలూ పండడానికి వీలు లేకుండా ఏడారులుగా తయారవుతున్నాయి. ఏదైనా ప్రాంతంలో ఎక్కువ కాలం వర్షాలు కురవక పండవలసిన పంటలు పండకపోతే దానిని కరువు అంటారు. ఏ ప్రాంతంలోనైనా సగటు వార్షిక వర్షపాతం 25 శాతం కంటే తక్కువగా ఉంటే ఆ ప్రాంతంలో కరువు స్థితిలో ఉన్నట్లుగా భారత వాతావరణ శాఖ చెపుతుంది. సగటున భారతదేశం 118 సెం.మీ వార్షిక వర్షపాతాన్ని పొందుతుంది. సగటు స్థాయి కంటే 25 నుండి 50% మధ్య వర్షపాతం ఉంటే మితమైన కరువు, సగటు కంటే 50% ఎక్కువ వర్షపాతం తగ్గినప్పుడు తీవ్రమైన కరువు ఏర్పడుతుంది. చాలా కాలం పాటు తగినంత వర్షపాతం లేనప్పుడు వాతావరణ కరువు, నేలలో తేమ, వర్షపాతం లేనప్పుడు వ్యవసాయ కరువు, సరస్సులు, జలాశయాలు, వివిధ రిజర్వాయర్‌లు లేదా నిల్వలలో ఉండవలసిన నీటి మట్టం కంటే దిగువకు పడిపోయినప్పుడు,నీటి కొరత వల్ల జలకరువు, తగినంత నీటి సరఫరా లేని కారణంగా సహజ పర్యావరణ వ్యవస్థ యొక్క ఉత్పాదకత తక్కువగా ఉన్నట్లయితే పర్యావరణ కరువులు ఏర్పడతాయి. స్వాతంత్ర్యం తరువాత మనదేశం 1965 – 67, 1972 – 73, 1979 – 80, 1985 – 88 సంవత్సరాలలో పెద్ద కరువులను ఎదుర్కొంది. . ఎడారికరణ కరువు రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి.

కారణాలు:

మనదేశంలో అల్పపీడనాలు లేకపోవడం, బలహీన



రుతుపవనాలు, సగటు కంటే తక్కువ వర్షపాతం, ముందస్తు రుతుపవనాల ఉపసంహారణ లేదా ఆలస్యంగా రుతుపవనాల ప్రారంభం, రుతుపవనాలలో సుదీర్ఘ విరామాలు లాంటి వాతావరణ కారణాలు కరువుకు కారణమవుతున్నాయి. వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులు, పశువులకు ఇతర జంతువులకు మేత కొరకు ఎక్కువ పచ్చికను వినియోగించడం, అటవీ నిర్మూలన, సహజ వృక్ష సంపదను దుర్వినియోగపరచడం, ఒకే పంటను దీర్ఘకాలికంగా పడించడం వంటివి ఎడారికరణ, కరువులుకు కారకాలుగా ఉంటుంటున్నాయి. ఐక్యరాజ్యసమితి సమాచారం మేరకు ప్రపంచ వ్యాప్తంగా 2000 సంవత్సరం నుండి కరువులు 29 శాతం పెరిగాయి. 230 కోట్ల మందికి త్రాగడానికి మంచి నీరు లేదు. ఇవే పరిస్థితులు కొనసాగితే 2040 సం. నాటికి 25 శాతం పిల్లలు నీటి కొరతను ఎదుర్కొంటారు. 2050 సం. నాటికి ప్రపంచ జనాభాలో 75 శాతం కరువుకు లోనవుతారు. ఇక మన దేశ విషయానికొస్తే వ్యవసాయం ఎక్కువగా రుతుపవనాల వర్షపాతంపై ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ యోగ్యమైన భూమిలో దాదాపు మూడింట రెండు వంతులు వర్షాధారం పైనే ఆధారపడి ఉంది. మొత్తం భౌగోలిక ప్రాంతం 32.872 కోట్ల హెక్టార్లలో 29.7 శాతం అంటే సుమారు 9.785 కోట్లు హెక్టార్లవిస్తీర్ణం భూక్షీణతకు గురైంది. మొత్తం విస్తీర్ణంలో 16 శాతం, జనాభాలో 12 శాతం మంది కరువు బారిన పడుతున్నారు. మొత్తం సగటు కరువు పీడిత ప్రాంతం 10 లక్షల చదరపు కి.మీ లేదా దేశంలోని మొత్తం భూభాగంలో మూడింట ఒక వంతుగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. నీతి అయోగ్ ప్రకారం ప్రతీ సంవత్సరం 1.2 కోట్ల హెక్టార్ల విస్తీర్ణం కరువు ఎడారి కారణంగా నష్టపోతున్నాయి. ఇక్కడ 2 కోట్ల టన్నుల ధాన్యం పండించవచ్చు. రాజస్థాన్ లో 2.123 కోట్ల హెక్టార్ల ఎడారి భూమి ఉండగా మహారాష్ట్ర, గుజరాత్ లో వరుసగా 1.43 కోట్ల హెక్టార్లు, 10.2 లక్షల హెక్టార్ల క్షీణించిన భూమి ఉంది. ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ నివేదిక ప్రకారం భారత్‌లో 90 శాతం రాష్ట్రాల్లో ఎడారీకరణ విస్తరించింది. దీంతో వ్యవసాయ రంగం కుదేలైపోతోంది. భారత్‌లో మొత్తం 29 రాష్ట్రాలకుగాను 26 రాష్ట్రాల్లో గత పదేళ్లలో ఎడారి ప్రాంతం బాగా పెరిగింది. రాజస్థాన్, ఢిల్లీ, గోవా, మహారాష్ట్ర, జార?ండ్, నాగాలాండ్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో రోజురోజుకీ సారవంతమైన భూములు తగ్గిపోతున్నాయి. మిజోరంలో లంగ్లే ప్రాంతంలో అధికంగా నేల పెళుసుబారుతుంది. 2003 నుండి 2011 మధ్యలో అత్యధికంగా18 లక్షల హెక్టార్ల భూమి ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్‌లో 14.35 శాతం, తెలంగాణలో 31.40 శాతం భూములు నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అధికంగా ఎడారీకరణ జరుగుతోంది.

కరువు ఫలితాలు:

ఈ కరువుల వలన వృక్ష సంపద నాశనం అవుతుంది. నేలకోతకు గురవుతుంది. నేల వంధ్యత్వంకి లోనవుతుంది. నీరు కలుషితం అవుతుంది. కొన్నిరకాల జాతులు నశించి జీవవైవిధ్యం దెబ్బవుతుంది. ఈ కరువుకు సమాజంలోని బలహీన వర్గాలు ఎక్కువగా ప్రభావితం అవుతారు. పేదరికం పెరుగుతుంది. కరువు ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గి వ్యవసాయోత్పత్తి తగ్గుతుంది. ప్రజల కొనుగోలుశక్తి తగ్గుతుంది. వ్యవసాయ కార్మికులకు ఉపాధి తగ్గుతుంది. తాగునీరు, పశుగ్రాసం, ఆహార కొరత ఏర్పడుతుంది. ఇది దేశ జిడిపి మీద ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి కారణమవుతుంది. అక్కడ ప్రజలు పోషకాహార లోపానికి గురవుతారు. ప్రజలు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతారు. ఆహార భద్రత సమస్యలు ఏర్పడతాయి. దేశ ఆర్థికాభవృద్ధి జరుగదు.

పరిష్కారాలు:

నదులను అనుసంధానం చేయాలి. మరిన్ని రిజర్వాయర్లు, ఆనకట్టల నిర్మాణానికి రూపకల్పన జరగాలి. కరువు నిరోధక పంటలను ప్రోత్సహించాలి. అడవులను కాపాడుకోవాలి. వృక్షాలను పెంచడం, పచ్చదనం పెంపు చేయాలి. వర్షపు నీటి సంరక్షణ భాగంగా వర్షంనీరు నదులు సముద్రాలలో కలసిపోకుండా చెక్ డ్యామ్ లను నిర్మించాలి. నేల స్థిరీకరణ కోసం షెల్టర్ బెల్టలను , ఉడ్లాట్లను ఉపయోగించాలి. వుడ్‌లాట్ అనేది చెట్ల యొక్క చిన్న ప్రాంతం. వుడ్‌లాట్‌లు నేల కోతను నిరోధించడంలో స్థానిక వాతావరణాన్ని మెరుగుపరచడంలోను, గాలిని శుద్ధి చేయడంలో కూడా సహాయపడతాయి. భూసార పరిరక్షణ, జీవ వైవిధ్యం పెంపుతో పాటుగా వ్యవసాయ భూములలో గృహాలు, పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేయకూడదు. పరిమితికి మించి వ్యవసాయ బోర్లు త్రవ్వగూడదు. అలాగే గృహాలలో మంచి నీటి బోర్లను అవసరానికి మాత్రమే వేయాలి. మన దేశంలో ఇప్పటికే కమాండ్ ఏరియా డెవలెప్మెంట్, ఇంటిగ్రేటెడ్ వాటర్ షెడ్ మేనేజ్మెంట్ ప్రోగ్రాం , జాతీయ కార్యాచరణ కార్యక్రమం లాంటివి అమలులో ఉన్నాయి.

జనక మోహన రావు దుంగ

# అంతర్గతంగా ప్రకాశించాలి

ప్రార్థన



మన ప్రాచీన సంప్రదాయాలు, సంస్కృతి ఎంతో జ్ఞానాన్ని, వివేకాన్ని ప్రతిబింబిస్తాయి. దీపావళి పండుగ అనంతరం ప్రారంభమయ్యే కార్తీక మాసమంతా... ప్రజలు తమ ఇళ్లను దీపాలతో అలంకరిస్తారు. అంతర్గతంగా మనలోని చీకటిని తొలగించుకోవడానికి జ్ఞానమనే దీపం కావాలని ఇది సూచిస్తుంది. రావణ వధ అనంతరం శ్రీరాముడు అయోధ్యకు, స్వదేశానికి తిరిగివచ్చినందుకు గుర్తుగా దీపావళి జరుపుకుంటారు. అంతేకాదు, మరొక రాక్షస రాజు నరకాసురుని మరణాన్ని కూడా దీపావళి పండుగ సూచిస్తుంది. అతనితో ముడిపడిన అందమైన కథ ఒక ఒకటి ఉంది.

శ్రీ కృష్ణుని చేతిలో ఓడిపోయి చనిపోబోతుండగా, జీవితాంతమూ తాను చేసిన పాపాలు గుర్తుకువచ్చి నరకాసురునికి పశ్చాత్తాపం కలిగింది. అప్పుడతడు, తాను జీవించినంత కాలమూ అష్టకష్టాలూ అనుభవించిన ప్రజలు, తాను చనిపోతున్నందుకు గుర్తుగా దీపాలు వెలిగించి ఆనందంగా గడపాలని శ్రీకృష్ణుడిని కోరుకున్నాడు. కృష్ణుడు అనుగ్రహించాడు. ఆ విధంగా శ్రీకృష్ణుని వరం వలన నరక చతుర్దశి పండుగరోజు అయింది. నరకాసురుడు పదహారు వేలమంది స్త్రీలను తన వద్ద బందీలుగా ఉంచుకున్నాడు. అతని మరణానంతరం వారందరికీ దిక్కు తోచక ప్రాణత్యాగానికి నిశ్చయించుకున్నారు. తమ ఇంటిపేరు ఇప్పుడు నరకాసురుడితో ముడిపడి ఉన్నందున, తాము పుట్టినింటికి తిరిగివెళ్లినా ప్రజలు ఆదరించరని, తమపై రాళ్లు రువ్వుతారని, కాబట్టి చనిపోవడమే మేలని వారు రోదించారు. అపుడు శ్రీకృష్ణుడు వారిని ఓదార్చి, 'ఆనాటి నుంచి మిమ్మల్ని నా భార్యలుగా స్వీకరిస్తున్నాను. మీరు నన్ను మీ భర్తగా చెప్పుకోండి. ఆ విధంగా నా ఇంటి పేరు మీకు వస్తుంది. మీరు సురక్షితంగా ఉంటారు' అని చెప్పాడు. అలా నరకాసురుడి రాణులంతా గోపికలుగా మారి శ్రీకృష్ణుని మహిమలను గానం చేస్తూ జీవించారు.

దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం మాత్రమే కాదు, దానిలో అంతకు మించిన అర్థం ఉంది. బుద్ధ భగవానుడు చెప్పినట్లుగా, 'మీకు మీరే వెలుగుగా ఉండండి. మనలో ప్రతి ఒక్కరమూ ఒక దీపం మాత్రమే వెలిగిస్తే సరిపోదు. ప్రపంచంలోని చీకటిని ఒక్కరే తొలగించలేరు. ఈ చీకటిని పారద్రోలేందుకు, ప్రతి ఒక్కరూ తమ లోపలి నుంచి ప్రకాశించాలి. తమలోని అంతర్గత కాంతిని ఇతరులతో పంచుకోవాలి. మీరే ప్రకాశం, వెలుగు అని గుర్తించడమే దీపావళి యొక్క సారాంశం. అందుకే బుద్ధుడు సంఘాన్ని సృజించాడు. జ్ఞానంతో వెలిగిపోతాయి. ఎక్కువమంది ప్రజలు జ్ఞానంలోకి మేల్కొన్నప్పుడు, మనం సంతోషకరమైన, దివ్యమైన సమాజాన్ని సృష్టించగలుగుతాము. దాని కోసం మనం ప్రపంచంలోని నలుమూలలకూ జ్ఞానాన్ని వ్యాపింపజేయాలి. జీవితంలో మనం వివిధ రకాల వ్యక్తులతో సంభాషిస్తాము. కొందరితో మనం కలిసిపోతాం, మరికొందరితో కలవము. కొందరు మీకు వ్యతిరేకంగా మారవచ్చు. లేదా మీరే వారికి వ్యతిరేకంగా మారవచ్చు. ఏదేమైనా, చివరికి మీరు వారిని ఇష్టపడకపోవచ్చు. ఈ విధంగా మనస్సు రాగద్వేషాలలో చిక్కుకుపోతుంది. అందుకే ఈనాటికీ చాలా గ్రామాల్లో, అందరికీ, బద్ధ శత్రువులకు కూడా ఈ రోజున మిఠాయిలు పంచే సంప్రదాయం ఉండటం మీరు చూడవచ్చు. కాబట్టి మీరు ఎవరినైనా మీ శత్రువుగా, లేదా మీకు నచ్చని వ్యక్తి అని భావిస్తే, వారితో మీరు మిఠాయిలు పంచుకున్నప్పుడు, మీరు వారిని కలిసినప్పుడు, ఆ చేదు భావన కరిగిపోతుంది. హృదయం మృదువుగా మారుతుంది. మనస్సు... ప్రేమ, సానుకూలత, వేడుకలతో నిండిపోతుంది. దీపావళి అంటే మనకు గతంలో ఇతరులపై కలిగిన బాధను, కోపాన్ని, ద్వేషాన్ని సమష్టిగా విడిచిపెట్టి, చీకటి నుంచి వెలుగులోకి వెళ్లడం.

## కర్టెన్లతో కనువిందుగా...



స్మార్ట్ హోమ్

ఇంటి అందాన్ని ద్విగుణీకృతం చేయడంలో డోర్ కర్టెన్లు ముందుంటాయి. ఎండ, దుమ్ము, ధూళి నుంచి ఇంటిని కాపాడతాయి. ప్రతి ఒక్కరూ వారి అభిరుచి ప్రకారం గుమ్మానికి, కిటికీలకు రంగు రంగుల కర్టెన్లు వేస్తుంటారు. కర్టెన్ రంగుల ఎంపికలో కూడా వాస్తు నియమాలు ఉన్నాయని చాలామందికి తెలియదు. ఇంటి సభ్యులు ధన ధాన్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలంటే ఏ దిశలో ఏ రంగు కర్టెన్ వేయాలో తెలుసుకుందాం!

కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు పెరగాలంటే దక్షిణం వైపున్న గదులకు ఎరుపు రంగు కర్టెన్లు వేయాలి.

పడమర, వాయువ్యం దిశలవైపున్న గదులకు, కిటికీలకు తెల్లని చిన్న ప్రింట్లు ఉన్న కర్టెన్లు వేస్తే ఆ ఇంట్లో ఉండేవారి శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. ఇల్లు ప్రకాశవంతంగా కూడా ఉంటుంది.

పడకగదికి నారింజ, గులాబీ, నీలం, క్రీమ్ కలర్ కర్టెన్లు లేదంటే ఏవైనా లేత రంగులవి వేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. బంధం బలపడుతుంది.

వాస్తు ప్రకారం ఆకుపచ్చ రంగు అత్యంత శుభప్రదమైంది. ఇంటి గుమ్మానికి, తూర్పువైపున్న గదులకు, స్టడీ రూమ్‌కు ఆకుపచ్చని కర్టెన్లు వేస్తే చేపట్టిన ప్రతి పనిలో విజయం లభిస్తుంది. ఇంట్లో పాజిటివ్ ఎనర్జీ, చదువుకునే పిల్లలకు ఏకాగ్రత పెరుగుతాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్
శనివారం
1 । నవంబర్ । 2024

# అమ్మే నాకు స్ఫూర్తి!



నటి ఐశ్వర్య అంటే తెలియని తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఉండరు. 'నా పేరు మీనాక్షి'తో తెలుగువారిని పలకరించిన ఈ కన్నడ కస్తూరికి ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే! 'సర్వమంగళ మాంగళ్యే' సీరియల్‌తో ఐశ్వర్య ఇంటింటా అభిమానులను సంపాదించుకున్నది. కన్నడ సినిమాల్లోనూ తళుక్కుమన్న ఈ నటి 'ముక్కుపుడక' సీరియల్‌తో అలరిస్తున్నది. వరుస అవకాశాలతో ప్రేక్షకుల మది దోచుకున్న బుల్లితెర బ్యూటీ ఐశ్వర్య 'జిందగీ'తో పంచుకున్న కబుర్లు..

చిన్నప్పటి నుంచీ అమ్మ కష్టం, ధైర్యం చూస్తూ పెరిగా. ఆమెనే స్ఫూర్తిగా తీసుకున్నా. ఎన్ని కష్టాలు ఎదురైనా అమ్మ ఒంటరిగా ఎదుర్కొన్నది. సమాజాన్ని ఎదిరించి నిలబడింది. అమ్మే నాకు స్ఫూర్తి. పెండ్లయిన కొన్నిరోజులకే అమ్మకు అత్తింటి ఆరళ్లు, భర్త ఈసడింపులు మొదలయ్యాయి. దిక్కుతోచని పరిస్థితుల్లో నేను కడుపులో ఉన్నప్పుడే అమ్మ ఒంటరి జీవితాన్ని ప్రారంభించింది. నా కోసం అమ్మ తన జీవితాన్నే త్యాగం చేసింది. నాన్న అనే ఎమోషన్ నా లైఫ్‌లో లేదు. అమ్మకు నటన అంటే ఇష్టం. తను నటి కావాలనుకుంది. కానీ తనని ఎవరూ ప్రోత్సహించలేదు. దాంతో నన్ను నటిగా తెరపై చూడాలనుకుంది. అందుకే నన్ను థియేటర్‌లో చేర్పించింది. పదో తరగతిలో ఉన్నప్పుడు థియేటర్ క్లాస్‌లో జాయినయ్యా. ఇంటర్ పూర్తవగానే ఆడిషన్స్ ఇవ్వడం ప్రారంభించా. నటిస్తూనే బీబీఎమ్ పూర్తిచేశా.

**అన్ని చానెల్స్‌లో..**

ఏషియానెట్ కన్నడలో ప్రసారమైన 'అనురూప' నా మొదటి సీరియల్. ఆ తర్వాత కలర్స్ చానెల్ కోసం అర్కా ప్రొడక్షన్లో 'గిరిజా కల్యాణ' చేశా. అదే నిర్మాణ సంస్థ ద్వారా తెలుగులో మొదటి అవకాశం వచ్చింది. 'నా పేరు మీనాక్షి' నా ఫస్ట్ తెలుగు ధారావాహిక. దాంతో నాకు మంచి పేరొచ్చింది. కన్నడ సీరియల్ 'అగ్నిసాక్షి' రీమేక్ 'సర్వమంగళ మాంగళ్యే'లో కూడా నేనే నటించాను. స్టార్ విజయ్ చానెల్ కోసం ఓ తమిళ ధారావాహికలోనూ నటించాను. జీ తెలుగులో 'ముక్కుపుడక' నా మొదటి ప్రాజెక్ట్. ఇలా అన్ని చానెల్స్ నన్ను ఆదరించాయి. తెలుగు ప్రేక్షకుల అభిమానంతో నటిగా నా ప్రస్థానం హ్యాపీగా కొనసాగుతున్నది.

**పెండ్లి తర్వాత..**

మా తాతయ్య జర్నలిస్ట్. చిన్నప్పటి నుంచీ సినీపరిశ్రమ, నటన మీద అవగాహన ఉంది. రోజూ ఆయన రాసే ఆర్టికల్స్ చదివేదాన్ని. లాక్‌డౌన్‌లో నా పెండ్లి జరిగింది. తర్వాత కూడా సీరియల్స్‌లో కొనసాగాలని నిర్ణయించుకున్నా. కుటుంబంతో గడపడానికి నెలలో కొన్ని రోజులు గ్యాప్ తీసుకుంటున్నాను. కన్నడలో రెండు సినిమాల్లో నటించా. స్టార్ హీరో యష్ చెల్లెలుగా, శివరాజ్ కుమార్ సినిమాలో ఓ పాత్రలో నటించా. అలాంటి స్టార్ హీరోలతో పనిచేయడం నిజంగా నా అదృష్టం. వాళ్ల నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ముఖ్యంగా పనిపట్ల వారు చూపే శ్రద్ధ, పాత్రలో లీనమయ్యే తీరు నన్నెంతో ప్రభావితం చేశాయి. సెట్‌లో మంచి సలహాలు ఇచ్చేవాళ్లు. టాలీవుడ్ స్టార్ హీరోలందరి సినిమాలు చూస్తుంటాను. ఒక మంచి మైథలాజికల్ పాత్రలో నటించాలన్న కోరికైతే ఉంది. అది ఎప్పటికి నెరవేరుతుందో చూడాలి.

**సౌందర్యతో పోలిక..**

చాలామంది నన్ను సౌందర్య అని పిలుస్తారు. ఆ మహానటి పోలికలు నాలో ఉన్నాయంటారు. అంత గొప్ప నటితో పోల్చడం చాలా సంతోషంగా ఉంటుంది. నటనలో ఎవ్వరినీ అనుకరించను. నాకంటూ ప్రత్యేకమైన శైలి ఉండాలనుకుంటాను.

# లైంగిక శక్తిని పెంచే దొండకాయ కూర!

పాక శాస్త్రవేత్త క్షేమశర్మ కూరగాయల్లో రెండో స్థానాన్ని బింబీఫలం... అంటే దొండకాయకు ఇచ్చాడు. మనం కూడా వంకాయ తరువాత అంతటి ప్రాముఖ్యతని దొండకాయకే ఇస్తాం. ఆరోగ్యం విషయంలో వంకాయంటే కొందరికి భయం ఉండవచ్చు... పడుతుందో పడదో అని! కానీ, దొండకాయతో



**అలాంటి భయం ఎవరికీ ఉండదు.**

**బింబీ ఫలం స్వాదు శీతం రక్తపిత్తప్రణాశనం!**

**స్తంభనం లేఖనం చాతివిబంధాధ్మానకారకమ్!!**

అంటే దొండకాయ వల్ల ఎటువంటి హాని ఉండదని ఈ శ్లోకార్థం. లేత దొండకాయల్నే కూరకి ఎంచుకోండి. ఉప్పు కలిపిన నీళ్లలో కొద్దిసేపు నానబెట్టి, బాగా కడగండి. పొడి వస్త్రంతో తుడిచాకే ముక్కలు తరగండి. చక్రాల్లా, నిలువుగా, చిన్నచిన్న ముక్కల్లా... కూర వండే తీరునుబట్టి దొండను ఎలాగైనా తరగొచ్చు. అలా తరిగిన ముక్కల్ని ఉప్పు వేసి పిండితే అందులో నీరు పోయి, కూర పొడిపొడిగా ఉంటుంది. నీటిని తీసేయటం అనేది తప్పనిసరేమీ కాదు. నేతిలోనో, నూనెలోనో వేయించేటప్పుడు నీటిని పిండిన ముక్కలైతే నూనెని పీల్చకుండా, మెత్తగా తినడానికి అనుకూలంగా ఉంటాయి. పిండకుండా వేయిస్తే నూనె పీలుస్తాయి. గట్టి చెక్కల్లా ఉంటాయి. ఇలాంటి ఇంకొన్ని కూరలు ఎలా చేయాలో చూద్దాం...

**ఇంగువ– మిరియాలతో కూర...**

బాండీలో కాగుతున్న నూనెలో కొద్దిగా ఇంగువనీ, లేత దొండ ముక్కల్ని వేసి దోరగా పైపైన వేగనివ్వండి. నల్లగా మాడేలా వేగితే అది అనారోగ్యకరం. బ్లాటింగ్ పేపర్ లేదా టిష్యూ పేపర్ మీద ఈ ముక్కలుంచి నూనెని తుడిచేస్తే మరీ మంచిది. ఈ ముక్కల్ని మళ్లీ బాండీలోకి తీసుకుని కొద్దిగా నెయ్యి వేసి, మిరియాల పొడి, ఉప్పు ఈ ముక్కల మీద చల్లి, తేలికగా వేయించి దించేయండి.

ఇలా వండిన దొండకాయ వేపుడు కూర జీర్ణ శక్తిని పెంచుతుంది. ఏ కూరగాయనైనా దానికి మించిన ఉష్ణోగ్రత ఇచ్చి వేయించినా, ఉడికించినా అది హానికరం అవుతుందని, సన్న సెగన తేలికగా వండాలని గుర్తుంచుకోవాలి.

**మజ్జిగతో ముద్ద కూర...**

ఒక చిన్న కప్పులోకి వేడివేడి నెయ్యి తీసుకుని, అందులో ఒక్కొక్క దొండకాయని రెండుమూడుసార్లు ముంచి తీయండి. బాండీలోకి ఈ నేతి దొండకాయల్ని తీసుకుని, సన్న సెగన కలియబెడుతూ పైపైన వేగనివ్వండి. మూడు వంతులు వేగిన తరువాత మీకు కావలసిన సుగంధ ద్రవ్యాలు, సైంధవ లవణం తగు మోతాదులో కలిపి మరికొద్దిసేపు వేయించండి. ఇప్పుడు చక్కగా చిలికిన చిక్కటి మజ్జిగని ఈ ముక్కలు మునిగేవరకూ పోసి, తడి ఆరేదాకా ఉడకనివ్వండి. ముద్ద కూరలాగా దగ్గరకు వచ్చాక కొత్తిమీర వగైరా కలిపి పొయ్యి మీద నుంచి దించేయండి. ఇలా చేసిన దొండ కాయకూర జాఠరాగ్నిని పెంచుతుందన్నాడు క్షేమశర్మ.

**దొండకాయ పెరుగుపచ్చడి..**

వంకాయతో బజ్జీ పెరుగు పచ్చడి చేసుకున్నట్టే లేత దొండకాయతోనూ చేసుకోవచ్చు. దొండకాయల తల, తోక భాగాలు తరిగి, నూనె లేదా నెయ్యి పట్టించి 'అంగారభర్జితం బింబీఫలం'... అంటే ఈ దొండకాయల్ని నిప్పుల మీద లేదా గ్రిల్ సాయంతో గ్యాసు పొయ్యి మంట మీద ఉంచి, మరీ నల్లగా మాడకుండా లోపలి భాగం సమంగా ఉడికేలా తిప్పుతూ కాల్చండి. ఉడికిన తరువాత మెత్తగా నూరి, పెరుగులో ఉంచి తగినంత ఉప్పు, కొత్తిమీర, ఆవపిండి వగైరా కలిపి, ఇంగువ తాలింపు పెట్టిన కమ్మని పెరుగు పచ్చడి జీర్ణశక్తిని పెంచుతుంది. అమీబియాసిస్ లాంటి వ్యాధులు, అల్సర్లతో బాధపడేవారికి ఇది మేలు చేస్తుంది.

నిప్పుల మీద కాల్చే అవసరం లేకుండా దొండకాయ ముక్కల్ని ఉప్పు కలిపిన నీళ్లలో ఉడికించి, పెరుగులో కలిపి కొద్దిగా ఆవపిండి, కొత్తిమీర వగైరా చేర్చి, ఇంగువ తాలింపు పెట్టిన పెరుగు పచ్చడి కూడా కమ్మగా ఉంటుంది. పై గుణాలనే కలిగి ఉంటుంది. దొండకాయ కూరకు నెయ్యి, ఇంగువ, పెరుగు... ఈ మూడూ ఆరోగ్యదాయక సహచరులు.

దొండకాయ చాలా రుచిగా ఉంటుంది. చలవనిస్తుంది. రక్తస్రావం అయ్యే జబ్బుల్లో తప్పనిసరిగా తినదగిన ఔషధం. పురుషుల్లో లైంగిక శక్తిని పెంచుతుంది. దీనికి లేఖనం (జిడ్డుని తొలగించే) గుణం ఉంది. అంటే, రక్తనాళాల్లో కొవ్వు పేరకుండా చేస్తుంది. గుండె జబ్బులున్నవారు, బీపీ, మధుమేహం వ్యాధులున్నవారికి మేలు చేస్తుంది. అతిగా తింటే విరేచనాన్ని బంధిస్తుంది... ఉబ్బరాన్ని కలిగిస్తుందని క్షేమశర్మ హెచ్చరించాడు. చింతపండు, అల్లంవెల్లుల్లి మసాలాలు లేకుండా క్షేమశర్మ చెప్పిన పద్ధతిలో దొండకాయల్ని వండుకుంటే ఉబ్బరంలాంటి చెడు కలగకుండా ఉంటుంది.

# అందానికి డ్రాగన్ ఫ్రూట్!



'ప్రతి ముప్పై సంవత్సరాలకూ బతుకు తాలూకు ఆలోచన మారుతుంది. సినిమావాళ్లు దాన్ని ట్రెండ్ అంటారు. వ్యాపారవేత్తలు ఫ్యాషన్ అంటారు. రాజకీయ నాయకులు తరం అంటారు, మామూలు జనం జనరేషన్ గ్యాప్ అంటారు. అయితే, ప్రతీ జనరేషన్‌లోనూ ఓ ఆలోచనను ముందుకు తీసుకెళ్లేవారు అతికొద్దిమందే ఉంటారు. వాళ్లనే టార్చ్‌బేరర్స్‌గా అభివర్ణిస్తారు. ఈ సినిమా డైలాగ్ ఇప్పుడెందుకు? అంటే.. డ్రాగన్ ఫ్రూట్ పుట్టిన దేశాల్లోనూ ఆ ఫలానికి సంబంధించిన ఉప ఉత్పత్తులు లేవు. తొలిసారిగా తెలంగాణకు చెందిన మనస్విని రెడ్డి డ్రాగన్ ఫ్రూట్స్‌తో సౌందర్య సాధనాలు తయారు చేస్తున్నారు. ఆ గులాబీ ఫలం (డ్రాగన్ ఫ్రూట్) తొక్క, తోలు, గుజ్జు, రసం.. ఏదీ వృథా కానివ్వకుండా రైతన్నలకు అండగా నిలుస్తున్నారు.మనస్విని తండ్రి శ్రీనివాస రెడ్డి దేశంలోనే తొలిసారిగా ఆరుట్లలో డ్రాగన్ ఫ్రూట్స్ (గులాబీపండు) పండించి రికార్డు సృష్టించారు. ఓ ఆరోగ్య ఫలాన్ని జనానికి పరిచయం చేశారు. క్రమంగా ఈ పండువల్ల లాభాలు అందరికీ తెలిశాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది రైతులు సాగు చేస్తున్నారు. అయితే, ఇది కాయ నుంచి పండుగా రంగు మారేందుకు నాలుగైదు రోజుల సమయమే తీసుకుంటుంది. ఆ లోగా మార్కెట్ చేసుకోవాల్సిందే. లేకపోతే పగుళు వస్తాయి. ఇక విక్రయానికి పనికిరావు. దీంతో కొన్నిసార్లు వృథా ఎక్కువగా ఉండేది. తండ్రితోపాటు మిగిలిన రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలనే ఉద్దేశంతో.. డ్రాగన్ ఫ్రూట్‌తో ప్రయోగాలు ప్రారంభించారు మనస్విని. ఆ ప్రయత్నంలో విజయం సాధించారు కూడా. ఆ ప్రయోగాల ఫలితమే.. 'నేచురల్ హ్యూస్ బై మన్స్వీ' స్టార్టప్.

**రైతుల కోసమే**

రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామానికి చెందిన వనిపల్లి మనస్విని రెడ్డికి చిన్నప్పటి నుంచీ వ్యవసాయంపై మక్కువ. క్లినికల్ న్యూట్రిషన్‌లో పీజీ చేశారు. కరోనా సమయంలో ఆమె తండ్రి సేద్యం సంక్షోభంలో పడింది. మిగిలిన రైతుల పరిస్థితీ అంతంతమాత్రమే. ఆయన పండించిన డ్రాగన్ ఫ్రూట్స్ ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. చెట్టు మీది పండు చెట్టు మీదే పగిలిపోతుంటే.. రైతుకు గుండె పగిలినంత పనయ్యేది. దీంతో తనే రంగంలోకి దిగారామె. ఆ పండ్లతో సౌందర్య సాధనాలు తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. తన ఫామ్‌హౌస్‌లో ఓ ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నారు. తొలి దశలో ఇబ్బందులు ఎదురైనా.. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకున్నారు. ప్రొఫెసర్ల సాయం తీసుకున్నారు. అందరి ప్రోత్సాహంతో అనుకున్నది సాధించారు మనస్విని. విస్తృత పరిశోధనల ఫలితంగా.. డ్రాగన్ ఫ్రూట్‌తో సబ్బులు, ఫేస్‌స్క్రబ్, బాత్‌సాల్ట్, లిప్ స్క్రబ్, లిప్‌బామ్, జామ్, వైన్, క్లీనింగ్ మాస్క్ వంటి అనేక ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. నిజానికి, డ్రాగన్ ఫ్రూట్‌ను ఎక్కువగా పండించే థాయిలాండ్, తైవాన్‌లలోనూ ఇలాంటి ఉత్పత్తులు లేవు. తన ఆవిష్కరణలకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో మార్కెటింగ్ మొదలుపెట్టారు. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో డ్రాగన్ ఫ్రూట్ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. తన తండ్రితో పాటు చుట్టుపక్కల గ్రామాల డ్రాగన్ ఫ్రూట్ రైతులకు మేలు చేసే ఉద్దేశంతో తమ ఫామ్‌హౌస్‌లో కోల్డ్ స్టోరేజ్ వసతిని కల్పిస్తున్నారు మనస్విని. దీనిద్వారా చుట్టు పక్కల గ్రామాల్లో ఓ వందమందికి ఉపాధి లభిస్తుంది. వందల టన్నుల పంటను నిల్వ చేయొచ్చు. గిట్టుబాటు ధర ఉన్నప్పుడే అమ్ముకోవచ్చు. గుజరాత్‌కు చెందిన ఆరోచ్ అగ్రో ప్రొడక్ట్స్‌వారు కూడా ఆరుట్ల వచ్చి మనస్విని ఉత్పత్తులను పరిశీలించారు. 'మార్పును అర్థం చేసుకోగలిగితేనే మార్కెట్‌లో నిలబడతాం. కొత్త ఆలోచనలే ఆంత్రప్రెన్యూర్‌కు ప్రాణం' అంటారు మనస్విని.

**కార్పొరేట్ స్థాయిలో**

ముందుగా మా ఉత్పత్తులకు విస్తృతంగా ప్రచారం కల్పిస్తాం. ఆ తర్వాత కార్పొరేట్ స్థాయిలో స్టోర్స్ ఏర్పాటు చెయ్యాలనే ఆలోచన ఉంది. ఇప్పటి వరకూ చాలా ఖర్చు చేశాం. త్వరలోనే వీహబ్‌ను సంప్రదిస్తాం. ఆ సంస్థ ఆర్థికంగా సాయం చేస్తే.. మా పని మరింత సులువు అవుతుంది. ప్రజలకు నాణ్యమైన, సేంద్రియ సౌందర్య సాధనాలు అందించడమే మా లక్ష్యం. డ్రాగన్ ఫ్రూట్‌కే పరిమితం కాకుండా మరిన్ని పండ్లపై ప్రయోగాలు చేసే ఆలోచన ఉంది. ఆ ప్రయత్నాలు కూడా ఫలిస్తే.. రైతులకు మరింత మేలు చేసినదాన్ని అవుతాను.

# నేను సగం.. నువ్వు సగం!



ఆభరణాలు ధరించడంలో అందం ఉంది, ఆనందమూ ఉంది. స్నేహితులు, ప్రేమికులు, భార్యాభర్తలు, తల్లీకొడుకులు, తండ్రీకూతుళ్లు.. ఒక్కో బంధానిది ఓ ప్రత్యేకత. ఆ అనుబంధంతో ముడిపడిన జ్ఞాపకాలను ఆభరణాలుగా మలుచుకుంటున్నారు చాలామంది. ఈ నగలు ఫ్రెండ్స్ జువెలరీ, కపుల్ జువెలరీ, బెస్టీ జువెలరీ పేరున అలరిస్తున్నాయి.

పెండ్లి, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా రకరకాల కారణాలతో స్నేహితులు, తోబుట్టువులు, ప్రేమికులు, కొన్నిసార్లు దంపతులు కూడా దూరంగా బతకాల్సి వస్తున్నది. 'భౌతికంగా మనమధ్య ఎడబాటు అనివార్యమైనా, మానసికంగా మాత్రం అతిదగ్గరగా ఉంటున్నాం' అని చాటుకోవడానికి 'సగం..సగం' తరహా నగలను ఎంచుకుంటున్నారు చాలామంది. నువ్వు సగం, నేను సగం.. అన్న విషయాన్ని ప్రతీకాత్మకంగా చాటుకోవడానికి ఒకే నగను రెండు ముక్కలుగా చేసుకుని.. చెరొకటి ధరిస్తున్నారు. పేర్లు, పదాల లాకెట్స్ కూడా వస్తున్నాయి.

సీతాకోక చిలుక, తాళంచెవి, పూలు, ఆకులు.. ఇలా రకరకాల డిజైన్లతో పెండెంట్లు వస్తున్నాయి. ఎన్ని ఉన్నా ఈ జువెలరీలో హృదయాకారానిదే హవా. స్నేహితులంటే ఇద్దరే కాకపోవచ్చు. ముగ్గురు, నలుగురు కూడా ఉండవచ్చు. ఆ మిత్రబృందం కోసం కూడా అందమైన పెండెంట్లు లభిస్తున్నాయి. ఉంగరాలు, బ్రేస్‌లెట్లు, గాజుల్లోనూ ఈ చిహ్నాలు ఒదిగిపోతున్నాయి. బంగారం, వెండి, ప్లాటినం వంటి ఖరీదైన లోహాల్లోనే కాదు, ఈతరానికి నప్పేలా.. థ్రెడ్, ఫ్యాబ్రిక్, లైట్‌వెయిట్, వన్‌గ్రామ్ గోల్డ్ వంటి వాటిలోనూ అందుబాటులో ఉన్నాయి.. ఫిఫ్టీ ఫిఫ్టీ ఆభరణాలు.





# రైల్వేలో మారిన రూల్స్.. రిజర్వేషన్ చేసుకోవాలంటే ఇవి తెలుసుకోవల్సిందే

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ రైల్వే రిజర్వేషన్లకు సంబంధించి కొత్త నిబంధనలను అమలులోకి తీసుకొచ్చింది. ఈరోజు నుంచి కొత్త రూల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు రైలు ప్రయాణం తేదీకి 120 రోజుల ముందు టికెట్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉండగా.. ఈరోజు (1 నవంబర్ 2024)నుంచి ఈ విధానంలో మార్పులు చేసింది. 120 రోజులు ఉన్న గడువును 60 రోజులకు..మీరు రైలు ప్రయాణం చేస్తున్నారా.. ముందుగానే టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలనుకుంటే ఈ కొత్త నిబంధనలు తెలుసుకోవల్సిందే. భారతీయ రైల్వే రిజర్వేషన్లకు సంబంధించి కొత్త నిబంధనలను అమలులోకి తీసుకొచ్చింది. ఈరోజు నుంచి కొత్త రూల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు రైలు ప్రయాణం తేదీకి 120 రోజుల ముందు టికెట్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉండగా.. ఈరోజు (1 నవంబర్ 2024)నుంచి ఈ విధానంలో మార్పులు చేసింది. 120 రోజులు ఉన్న గడువును 60 రోజులకు తగ్గించింది. దీంతో ఏదైనా రైలు టికెట్ ముందుగా బుక్ చేసుకోవాలంటే ప్రయాణ తేదీకి 60 రోజుల ముందు మాత్రమే బుక్ చేసుకునే వీలుంటుంది. భారతీయ రైల్వే తన సేవల్లో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించేందుకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ మార్పు ద్వారా ప్రయాణికులు కోరుకున్న సీటును వారికి కేటాయించే అవకాశాలు పెరగనున్నాయి.

# జస్ట్ 5 నెలల్లో.. భారీగా పెరిగిన హెచ్ఐవీ కేసులు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాఖండ్‌లోని రామ్‌నగర్‌లో హెచ్ఐవీ కేసులు ఒక్కసారిగా ఇబ్బడి ముబ్బడి పెరిగాయి. దీంతో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారి హరీశ్ చంద్ర పంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 5 మాసాల్లోనే 20 మందికి ఈ వ్యాధి సోకిందని తెలిపారు. గత కొన్నేళ్లుగా ఈ కేసుల సంఖ్య భారీగా పెరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు.అయితే ఈ వ్యాధి సోకిన వారు ప్రస్తుతం పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని వివరించారు. 17 ఏళ్ల యువతి మాదక ద్రవ్యాలకు బానిసగా మారిందన్నారు. నగదు కోసం ఆమె పలువురు వ్యక్తులతో లైంగిక సంబంధం పెట్టుకుందని చెప్పారు. వారికి సైతం హెచ్ఐవీ సంక్రమించిందని అనుమానిస్తున్నారు. వారి నుంచి వారి భార్యలకు ఈ వ్యాధీ వ్యాపించిందని పేర్కొన్నారు.సాధారణంగా నైనిటాల్‌లో ఏడాదికి 20 ఏయిడ్స్ కేసులు నమోదవుతాయి. కానీ ఈ ఏడాది కేవలం ఐదు నెలల్లోనే 20 కేసులు నమోదు కావడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏయిడ్స్‌పై స్థానికంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ వ్యాధీ పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు పలు కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అలాగే అక్రమ మార్గంలో సరఫరా అవుతున్న డ్రగ్స్ కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తుంది. మరోవైపు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

# ఆనవాయితీని కొనసాగించిన ప్రధాని మోదీ.. సైనికులతో కలిసి దీపావళి



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా దీపావళి పండగను సైనికుల మధ్య జరుపుకున్నారు. ఇందుకోసం ఆయన ఈ రోజు (గురువారం) గుజరాత్‌లోని కచ్ఛ్‌లో సర్ క్రీక్‌లోని లక్కీ నాలా వద్ద బీఎస్ఎఫ్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సిబ్బందిని కలిశారు. ఆర్మీ యూనిఫాం ధరించి సైనికులతో గడిపారు. అక్కడున్న సైనికులకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సైనికులకు స్వీట్లు పంచిపెట్టారు.

**2014 నుంచి ఇదే ఆనవాయితీ**

కాగా ప్రధానిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన 2014 నుంచి వివిధ ప్రాంతాల్లోని సైనికులతో కలిసి మోదీ దీపావళి జరుపుకుంటున్నారు. 2014లో సియాచిన్, 2015లో పంజాబ్ సరిహద్దు, 2016లో హిమాచల్ ప్రదేశ్‌లోని సుమ్డో, 2017లో జమ్మూ కాశ్మీర్‌లోని గురేజ్ సెక్టార్, 2018లో ఉత్తరాఖండ్‌లోని హర్సిల్, 2019లో జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరి, 2020లో రాజస్థాన్‌లోని లాంగేవాలా, 2021లో కశ్మీర్‌లోని నౌషేరాలో, 2022 జమ్మూ కశ్మీర్‌లోని కార్గిల్‌లో, 2023 హిమాచల్‌లోని లెప్చాలో సైనికులతో కలిసి దీపావళి సెలబ్రేట్ చేసుకున్నారు.

**వల్లభాయ్ పటేల్ వేడుకల్లో ప్రధాని**

మరోవైపు 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయ సమైక్యతలో ముఖ్య పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లో ఇవాళ (గురువారం) తెల్లవారుజామున జరిగిన జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఘన నివాళులు అర్పించారు. సర్దార్ పటేల్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' ఉన్న కెవాడియాకు వెళ్లారు. అక్కడ జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవం రోజునే దీపావళి పర్వదినం రావడం ఎంతో ప్రత్యేకమని మోదీ వ్యాఖ్యానించారు. సర్దార్ పటేల్ 150వ జయంతిని రెండేళ్లపాటు నిర్వహించనున్న వేడుకలు ప్రారంభమయ్యాయని మోదీ ప్రకటించారు.

# ముంబైలో మెరూన్ 5 కాన్సర్ట్.. టిక్కెట్లు ఇలా బుక్ చేసుకోండి!

**న్యూఢిల్లీ-నవభూమి:** పాప్ మ్యూజిక్ అభిమానులకు ఓ గుడ్ న్యూస్. పాప్యులర్ అమెరికన్ పాప్ బాండ్ త్వరలో భారత్‌లో పర్యటించనుంది. భారత్‌లో ఈ బృందం పర్యటించడం ఇదే తొలిసారి కావడంతో అభిమానుల్లో ఆసక్తి ఆకాశాన్నటుంటోంది. డిసెంబర్ 3న ముంబైలోని మహాలక్ష్మి రేసు కోర్సులో ఈ బ్యాండ్ మ్యూజిక్ ఈవెంట్‌ను ఏర్పాటు చేశారు.ఈ కాన్సర్ట్‌కు సంబంధించిన టిక్కెట్లు నవంబర్ 8 మధ్యాహ్నం 2 గంటల నుంచి బుక్ మై షోలో అందుబాటులోకి రానున్నాయి. అయితే, కోటక్ క్రెడిట్ కార్డుదారులు మాత్రం ఎర్లీ యాక్సెస్ కింద నవరబర్ 6 మధ్యాహ్నం 12 గంటల నుంచే బుక్ మై షో ద్వారా టిక్కెట్స్ బుక్ చేసుకోవచ్చు. సోషల్ మీడియా ద్వారా బుక్ మై షో సంస్థ ఈ విషయాన్ని ధ్రువీకరించింది.ఈ యాప్‌ను కొత్తగా ఇన్‌స్టాల్ చేసుకుంటున్నట్టైతే ముందుగా అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. ఆ తరువాత నవంబర్ 8 నుంచి నచ్చిన టిక్కెట్లు కొనుగోలు చేయొచ్చు.కోటక్ క్రెడిట్ కార్డు ఉన్న వారు మాత్రం తమ అకౌంట్ ద్వారా యాప్‌లో లాగిన్ అయ్యి నవంబర్ 6 నుంచి టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు.కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిలిస్‌కు చెందిన మెరూన్ 5 బ్యాండ్‌లో ప్రధాన సభ్యుడు ఆడమ్ లెవీన్‌తో పాటు జెస్సీ కార్మైకల్, జేమ్స్ వాలెంటైన్, మాట్ ఫ్లిన్, పీజే మోర్టన్, శామ్ ఫారర్ ఉన్నారు. తొలుత ఈ బ్యాండ్ కారాస్ ఫ్లవర్స్ పేరిట 1994లో ఏర్పాటైంది. కొన్నేళ్లకే బ్యాండ్ విడిపోయింది. ఆ తరువాత మళ్లీ 2001లో బ్యాండ్ సభ్యులందరూ ఒక్కచోటకు వచ్చి మరూన్ 5 పేరిట తమ బ్యాండ్‌ను ఏర్పాటు చేశారు.

# రికార్డు స్థాయిలో ఆదాయం.. భారత్‌లో యాపిల్ మరో నాలుగు స్టోర్లు : టిమ్ కుక్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో యాపిల్ ఐఫోన్ల విక్రయాలు ఊపందుకున్నాయి. ముంబై, ఢిల్లీలో ఉన్న రెండు స్టోర్ల ద్వారా భారీగా ఆదాయం సమకూరుతోంది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీకి ఐఫోన్ విక్రయాల ద్వారా భారత్ నుంచి వస్తోన్న ఆదాయం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో దేశవ్యాప్తంగా ఐఫోన్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే మరో నాలుగు స్టోర్లను ప్రారంభించనున్నట్లు సంస్థ సీఈవో టిమ్ కుక్ తాజాగా ప్రకటించారు.

'మొదటి త్రైమాసికంలో రెండు కొత్త స్టోర్‌లను ప్రారంభించాం. ఢిల్లీ, ముంబైలో ఈ అవుట్‌లెట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే భారత్ కస్టమర్లకు నాలుగు కొత్త స్టోర్‌లను తీసుకురాబోతున్నాం' అని యాపిల్ సీసీవో వెల్లడించారు. కాగా, కొత్త స్టోర్లను ఏయే నగరాల్లో ప్రారంభిస్తారన్న విషయాన్ని మాత్రం టిమ్ కుక్ వెల్లడించలేదు. అయితే, పుణె, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలలో కొత్త స్టోర్లను నెలకొల్పనున్నట్లు యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియర్డ్రి ఓబ్రియాన్ ఇటీవలే తెలిపిన విషయం తెలిసిందే. ఇక ప్రస్తుతం భారత్‌లో రెండు యాపిల్ స్టోర్లు మాత్రమే ఉన్న విషయం తెలిసిందే. ఒకటి ముంబైలోని బీకేసీలో ఉండగా.. మరొకటి ఢిల్లీలోని సాకేత్‌లో ఉంది. వీటిని 2023లో యాపిల్ అందుబాటులోకి తెచ్చింది.

మరోవైపు సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను యాపిల్ తాజాగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఐఫోన్ విక్రయాలు భారీగా పెరిగి ప్రపంచ రికార్డులను నెలకొల్పినట్లు సీఈవో టిమ్ కుక్ ఈ సందర్భంగా తెలిపారు. కంపెనీ రెవెన్యూ గతంలో కంటే 6 శాతం పెరిగి 94.9 బిలియన్ డాలర్లు అంటే రూ.7.9 లక్షల కోట్లుకు చేరినట్లు తెలిపారు. 'యాపిల్ తాజా త్రైమాసిక ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఆదాయాన్ని నమోదు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా భారీగా ఐఫోన్ అమ్మకాలు జరిగాయి. యూఎస్, యూరప్, బ్రెజిల్, మెక్సికో, ఫ్రాన్స్, బ్రిటన్, కొరియా సహా పలు దేశాల్లో రికార్డు స్థాయిలో ఆదాయం అర్జించింది. ప్రత్యేకించి భారతదేశంలో యాపిల్ ఐఫోన్ సేల్స్ గరిష్ఠాలను చేరుకున్నాయి. భారత్ నుంచి వచ్చే ఆదాయం సరికొత్త రికార్డును నెలకొల్పింది' అని టిమ్ కుక్ వెల్లడించారు.

# మహిళా అభ్యర్థిపై 'ఇంపోర్టెడ్ మాల్' వ్యాఖ్యలు.. చిక్కుల్లో ఎంపీ



**ముంబై-నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో విమర్శల దాడి తీవ్రమవుతోంది. ఎన్నికలకు ముందు బీజేపీని వీడి ఆ పార్టీ భాగస్వామ్య పక్షమైన ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన షైన ఎన్‌సీ పై అనుచిత వ్యాఖ్యల వివాదంలో ఉద్ధవ్ థాకరే ఎంపీ అరవింద్ సావత్ చిక్కుకున్నారు. ఆమెను 'ఇంపోర్టెడ్ మాల్' అంటూ సంబోధించడం ఈ విదానికి కారణమైంది. ఆయన వ్యాఖ్యలపై షైన ఎన్‌సీ అభ్యంతరం తెలిపారు. ఆ పార్టీ (శివసేన యూబీటీ) మానసిక స్థితిని ఎంపీ వ్యాఖ్యలు చెప్పకనే చెబుతున్నాయని విమర్శించారు. ఈ ఎన్నికల్లో షిండే శివసేన అభ్యర్థిగా ముంబాదేవి నియోజకవర్గం నుంచి షైన ఎన్‌సీ పోటీ చేస్తున్నారు.సావంత్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ, ఆమె (షైన ఎన్‌సీ) ఇటీవల వరకూ బీజేపీలో ఉన్నారని, అక్కడ టిక్కెట్ రాకపోవడంతో మరో పార్టీలోకి వెళ్లారని చెప్పారు. "ఇక్కడ దిగుమతి సరుకులను అంగీకరించరు. ఒరిజనల్ వస్తువులనే ఆదరిస్తారు. మావి ఒరిజనల్ గూడ్స్" అని వ్యాఖ్యానించారు.

**మహిళా గౌరవంపై దాడి..**

కాగా, 'ఇంపోర్ట్ మాల్' అంటూ సావంత్ మాట్లాడటంపై షైన ఎన్‌సీ అభ్యంతరం తెలిపారు. మహిళల గౌరవంపై జరుపుతున్న దాడిగా దీనిని పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) నేతలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశించారు. గతంలో సావంత్ తనను కూడా ప్రచారం కోసం తీసుకువెళ్లారని, ఇప్పుడు నేను ఇంపోర్టెడ్ మాల్‌గా కనిపిస్తున్నానా అని ప్రశ్నించారు. ముంబాదేవిలో ప్రతి మహిళను ఆయన 'మాల్'గానే చూస్తారా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఉన్న మహిళలపై గౌరవం లేకుండా మాట్లాడం మంచిది కాదన్నారు. "నేను మహిళను. మాల్‌ని కాదు. నగడా పోలీస్ స్టేషన్‌లో మీపై ఫిర్యాదు చేస్తాను" అని అన్నారు. కొద్దిసేపటి తర్వాత ఆమె నాగ్‌పద పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అరవింద్ సావంత్‌పై ఫిర్యాదు చేశారు.

**సావంత్ ప్రతిస్పందన**

కాగా, షైన ఎన్‌సీ స్పందనపై అరవింద్ సావంత్ తిరిగి స్పందించారు. రెండ్రోజుల క్రితం తాను మాట్లాడానని, ఈ రెండ్రోజులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళలంటే తనకు గౌరవమని, తాను బాలాసాహెబ్ సేన నుంచి వచ్చానని చెప్పారు. తన వ్యాఖ్యలను ఆమె తప్పుగా అర్థం చేసుకున్నారని, తనకెలాంటి చెడు ఉద్దేశాలు లేవని అన్నారు. ఫిర్యాదు చేసుకుంటే చేసుకోవచ్చని చెప్పారు.

# బళ్లారి జైలు నుంచి దర్శన్ విడుదల..



**బళ్లారి(బెంగళూరు): నవభూమి:** రేణుకాస్వామి హత్యకేసులో ఏ-2 నిందితుగా ఉంటూ బళ్లారి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కన్నడ హీరో దర్శన్ బుధవారం బెయిల్‌పై విడుదలయ్యారు. బెయిల్ పత్రాలను సాయంత్రం 5 గంటలకు న్యాయవాది జైలర్(కు అందజేశారు. పరిశీలించిన ఆయన దర్శన్‌ను విడుదల చేశారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారని ఆయన తరపు న్యాయవాదులు వేసిన పిటిషన్‌పై షరతులతో కూడిన బెయిల్‌ను న్యాయాధికారి మంజూరు చేశారు. ఆగస్టు నెల 29న బళ్లారి జైలుకు దర్శన్‌ను తీసుకొచ్చారు.సుమారు 60 రోజుల పాటు బళ్లారి జైల్లో దర్శన్ నిందితుడగా హై సెక్యూరిటీ సెల్(లో ఉన్నారు. ఆయన కోసం ఆయన భార్య, తల్లి , సోదరులు, బావ మరిది అనేక సార్లు వచ్చారు. దర్శన్ విడుదల సందర్భంగా ఆయన భార్య జైలు వద్దకు వచ్చారు. జైలు నుంచి బయటకు రాగానే భార్యను కౌగిలించుకుని దర్శన్ భావోద్వేగానికి గురై కన్నీరు మున్నీరయ్యారు. పోలీసుల బందోబస్తు నడుమ బయటకు వచ్చిన ఆయన కారు ఎక్కి బెంగళూరు వైపు తరలి వెళ్లారు. ఆయనను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. వారిని కంట్రోల్ చేయడానికి పోలీసులు నానా తంటాలు పడ్డారు.

# గంటపాటు కుండపోత..



**చెన్నై: నవభూమి:**రాజధాని నగరం చెన్నైలో రెండు రోజులపాటు ఎండవేడితో అవస్థలు పడిన నగరవాసులు బుధవారం ఉదయం హఠాత్తుగా కురిసిన కుండపోత వర్షానికి ఊరట చెందారు. ఈ వర్షానికి నగరమంతటా చల్లటివాతావరణం నెలకొంది. అయితే కుండపోత వర్షంతో టి.నగర్, నుంగంబాక్కం వంటి ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. బుధవారం ఉదయం 8 నుండి 12 గంటల వరకు భానుడు భగ్గుమన్నాడు. ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమైంది. సన్నటి జల్లులతో ప్రారంభమైన వర్షం కుండపోతగా మారింది.

మనలి, తిరువొత్తియూరు, తండయార్‌పేట, వాషర్‌మెన్‌పేట, రాయపురం, మింట్, ప్యారీస్ కార్నర్, ట్రిప్లికేన్, రాయపేట, మైలాపూరు, నుంగంబాక్కం, అంబత్తూరు, విల్లివాక్కం, పాడి, కొరట్టూరు, అన్నానగర్, మధురవాయల్, కోయంబేడు వలసరవాక్కం పూందమల్లి, తాంబరం, గిండి, నుంగంబాక్కం, రెడ్‌హిల్స్, సైదాపేట తదితర ప్రాంతాల్లో గంటకు పైగా భారీ వర్షం కురిసంది.

ఈ వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అన్నానగర్ ప్రాంతంలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు 9 సెం.మీ.ల వర్షపాతం నమోదైందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే విధంగా మనలి, కొళత్తూరు, పెరంబూరు, అమింజికరై, మధురవాయల్ ప్రాంతాల్లో 6 సెం.మీ.ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.మన్నార్ జలసంధి ప్రాంతం, పడమటి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా గురువారం 15 జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దిండుగల్, మదురై, తిరుచ్చి, కరూరు(నామక్కల్, సేలం, ఈరోడ్, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, వేలూరు, తిరువణ్ణామలై, కళ్ళకురిచ్చి, అరియలూరు తదితర జిల్లాల్లో పలు చోట్ల వర్షం కురుస్తుందని తెలిపారు. చెన్నై నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై కొన్ని చోట్ల ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.

# డెమ్‌చోక్‌లో భారత బలగాల పెట్రోలింగ్ షురూ



**న్యూఢిల్లీ-నవభూమి:**తూర్పు లద్దాఖ్‌లోని డెమ్‌చోక్ సెక్టార్ లో భారత బలగాల పెట్రోలింగ్ శుక్రవారంనాడు ప్రారంభమైంది. డెప్సాంగ్ సెక్టార్‌లోనూ పెట్రోలింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్టు ఇండియన్ ఆర్మీ వర్గాలు తెలిపాయి. డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాల్లో బలగాల ఉపసంహరణ రెండ్రోజుల క్రితం పూర్తవడంతో ఇరుదేశాల సైనికులు ఎల్ఏసీ వెంబడి పలు ప్రాంతాల్లో గురువారంనాడు స్వీట్లు పంచుకున్నారు.అక్టోబర్ 21న భారత్, చైనా మధ్య బలగాల ఉపసంహరణ, పెట్రోలింగ్ పునరుద్ధణకు ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం అక్టోబర్ 29లోగా బలగాల ఉపసంహరణ పూర్తి కావాల్సి ఉండగా, ఇరువర్గాలు తమ మౌలిక సదుపాయాలను తొలగించి వెనక్కి మళ్లాయి. దీంతో 2020లో గస్తీ పాయింట్లకు భారత బలగాలు చేరుకునేందుకు మార్గం సుగమమైంది. ఈ క్రమంలో డెమ్‌చోక్ ప్రాంతంలో భారత బలగాల గస్తీ తిరిగి ప్రారంభమైనట్టు అధికారులు ప్రకటించారు.చైనా, భారత్ బలగాల మధ్య 2020లో సరిహద్దుల మధ్య తలెత్తిన ప్రతిష్ఠంభన ఉద్రిక్తతలకు దారితీసింది. బలగాలు కాల్పులకు దిగడంతో భారత్ వైపు నుంచి 20 మంది సైనికులు, చైనా నుంచి పలువురు సైనికులు మృతిచెందారు. దీంతో ఈ ఉద్రిక్తతలకు తెరవేయాలని దౌత్య మార్గాల ద్వారా జరిగిన చర్చలు ఫలించి అక్టోబర్ 21న భారత్-చైనా మధ్య బలగాల ఉపసంహరణ, గస్తీ పునరుద్ధరణ ఒప్పందం జరిగింది. రష్యాలో బ్రిక్స్ సదస్సుకు హాజరైన ప్రధానమంత్రి మోదీ, చైనా అధ్యక్షుడు జి.జిన్‌పింగ్ సమావేశం

# జీఎస్టీ స్కాంలో జర్నలిస్టుకు చుక్కెదురు.. బెయిల్ పిటిషన్ కొట్టివేత



**అహ్మదాబాద్-నవభూమి:**వస్తు సేవల పన్ను మోసానికి సంబంధించిన కేసులో 'ది హిందూ' జర్నలిస్టు మహేశ్ లంగా బెయిల్ పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు బుధవారం కొట్టేసింది. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మనీష్ వి చౌహాన్ అతని బెయిల్‌ని తిరస్కరించారు. ఆదాయపు, వస్తు సేవల పన్ను ఎగవేసేందుకు సదరు జర్నలిస్టు ఇతరులతో కలిసి కుట్ర పన్నాడని అభియోగాలున్నాయి. ధృవి ఎంటర్‌ప్రైజెస్ అనే కంపెనీ ద్వారా మహేశ్ నేరుగా రూ.44 కోట్ల అక్రమ లావాదేవీలు జరిపినట్లు విచారణలో తేలింది. బోగస్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లను సులభతరం చేసేందుకే ఈ లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కోర్టు పేర్కొంది. "మహేశ్ సహ నిందితులతో కలిసి ధృవీ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థతో జీఎస్టీని ఎగవేసేందుకు కుట్ర పన్నారు.

కేసు పత్రాలను పరిశీలిస్తే నిందితుడు ఈ కేసులో క్రియాశీల పాత్ర పోషించినట్లు అర్థమవుతోంది. విచారణ ఇంకా కొనసాగుతున్నందునా.. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉంది. అందుకే బెయిల్ రద్దు చేశాం" అని కోర్టు పేర్కొంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను మోసపూరితంగా పొందేందుకు ధ్రువి ఎంటర్‌ప్రైజెస్ శాశ్వత ఖాతా నంబర్‌ను ఉపయోగించి ఆరు బోగస్ సంస్థలను సృష్టించిందని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో అక్టోబర్ 7న మహేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. మేజిస్ట్రేట్ రిమాండ్ ఆర్డర్‌ను సవాలు చేస్తూ గుజరాత్ హైకోర్టులో అతను బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. అయితే అక్టోబర్ 14న పిటిషన్‌ను ఉపసంహరించుకున్నాడు.

**మరో రెండు కేసుల్లో..**

పిటిషన్ ఉపసంహరించుకున్న తర్వాత మరో రెండు కేసుల్లో మహేశ్ నిందితుడిగా మారాడు. అహ్మదాబాద్‌లో ఒక వ్యాపారవేత్తను మోసం చేశారనే ఆరోపణలపై పోలీసులు మహేశ్‌పై కేసు నమోదు చేశారు. రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని మోసాలకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. గుజరాత్ మారిటైమ్ బోర్డుకు సంబంధించిన ప్రభుత్వ పత్రాలను కలిగి ఉన్నారనే ఆరోపణలతో అక్టోబర్ 22న రెండో కేసు నమోదు చేశారు.

మొదటి కేసులో అరెస్టయిన సమయంలో అతని నుంచి మారిటైమ్ బోర్డు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ పత్రాలు కలిగి ఉన్నారనే ఆరోపణలపై అతనిపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని పలు సంస్థలు పోలీసులను కోరాయి. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్, ప్రెస్ అసోసియేషన్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్‌ల సంయుక్త ప్రకటనలో జర్నలిస్టులు తమ పనివేళలో అవసరం నిమిత్తం పలు రకాల పత్రాలను కలిగి ఉండవచ్చని పేర్కొంది.

# ఆఫ్‌లైన్ పరీక్షలను తగ్గించి.. ఆన్‌లైన్, హైబ్రిడ్ పద్ధతులను ఎంచుకోండి

**న్యూఢిల్లీ-నవభూమి:** జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కార్యకలాపాలను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ప్రవేశ పరీక్షల్లో పలు సంస్కరణలను సూచిస్తూ నివేదిక సిద్ధం చేస్తోంది. ఎన్టీఏ నిర్వహణపై సమీక్ష జరిపేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఇస్రో మాజీ చైర్మన్ ఆర్.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ తుది నివేదికను సమర్పించేందుకు రెండు వారాల గడువు కావాలని ఈ నెల 21న కేంద్రం సుప్రీంకోర్టును కోరింది. నివేదిక దాదాపు పూర్తయిందని, ఎన్టీఏ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, దేశంలో పెద్దపెద్ద ప్రవేశ పరీక్షల నిర్వహణలో చేపట్టాల్సిన సంస్కరణలపై పలు సిఫారసులు చేసిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

సాధారణ (ఆఫ్‌లైన్) పరీక్షలను తగ్గించడం లేదా పూర్తిగా ఆన్‌లైన్ అవకాశం లేని పరిస్థితుల్లో హైబ్రిడ్ విధానాన్ని ఎంచుకోవడంబీ నీట్ సహా పలు ప్రధాన పరీక్షలను రాసే సంఖ్యపై పరిమితి విధించడంబీ ఔట్‌సోర్స్ సిబ్బంది, పరీక్ష కేంద్రాల పాత్రను తగ్గించడం ద్వారా పరీక్షల పవిత్రతను కాపాడడం వంటి సిఫారసులు చేసినట్లు వెల్లడించాయి. భారీ స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను పరిష్కరించే అంశంపై చర్చించేందుకు కమిటీ 22 సార్లు సమావేశమైంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
శనివారం
1 । నవంబర్ । 2024

# విజయ్ దళపతి రాజకీయ పార్టీపై కీలక వ్యాఖ్యలు చేసిన సూపర్ స్టార్ రజనీకాంత్



తమిళ నటుడు స్టార్ విజయ్ దళపతి రాజకీయ పార్టీని స్థాపించారు. ఇటీవల తమిళగ వెట్రి కళగం పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించారు. తన పార్టీ రాజకీయాల్లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. రాజకీయ ప్రయాణంలో, టీవీకే నిర్మాణాత్మక విమర్శలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించారు. విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై సూపర్ స్టార్ రజనీకాంత్ స్పందించారు. విజయ్ రాజకీయ రంగ ప్రవేశం విజయవంతమైందని ప్రశ్నించారు. టీవీకే తొలి బహిరంగ సభను చాలాచక్కగా నిర్వహించారంటూ అభినందించారు. విజయ్ తన పార్టీ సభను ఎంతో విజయవంతంగా నిర్వహించారనన్న ఆయన.. అందుకు అభినందిస్తున్నానని చెప్పారు. అక్టోబర్ 27న విల్లుపురం జిల్లా విక్రవండిలో టీవీకే భారీ సభ నిర్వహించింది. విజయ్ అభిమానులు, మద్దతుదారులు భారీగా తరలివచ్చారు. ప్రసంగం వాడీవేడిగా సాగింది. బీజేపీ, డీఎంకే పార్టీలను తమ ప్రత్యర్థులుగా ప్రకటించారు. అలాగే, పలు పార్టీలకు స్నేహహస్తాన్ని అందించారు. 2026లో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 234 స్థానాల్లోనూ పోటీ చేయనున్నట్లు విజయ్ ప్రకటించారు.

నవచిత్ర




# లండన్‌లో ప్రియాంక చోప్రా దీపావళి సెలబ్రేషన్స్.. రెడ్ శారీలో మెరిసిన గ్లోబల్ స్టార్



బాలీవుడ్ నటి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తన భర్త నిక్ జొనాస్‌తో కలిసి ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్‌తో వేడుకలను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి హాలీవుడ్ స్టార్స్, ఫ్రెండ్స్‌కు ప్రత్యేకంగా పార్టీ ఇచ్చారు. లండన్‌లోని జింఖానా రెస్టారెంట్‌లో వీరు తమ ఫ్రెండ్స్‌కు ఈ పార్టీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పీసీ సంప్రదాయ చీర కట్టులో మెరిశారు. సబ్యసాచి డిజైన్ చేసిన రెడ్ శారీలో ఎంతో అందంగా కనిపించారు. నిక్ సైతం సంప్రదాయ కుర్తా ధరించి ఆకట్టుకున్నారు. పార్టీ సందర్భంగా తమ ఫ్రెండ్స్‌కు వీరు ఇండియన్ స్వీట్స్‌ను గిఫ్ట్‌గా అందించినట్లు తెలుస్తోంది. పీసీ దివాలీ పార్టీకి సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.



# విజయ్‌తో రష్మిక దీపావళి.. పిక్స్ తీసిన తమ్ముడు



ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో విజయ్, రష్మిక డేటింగ్ రూమర్స్ పై చర్చ నడుస్తోంది. టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న మధ్య ప్రేమాయణం నడుస్తుందని ఎప్పటి నుంచో ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆ మధ్య ముంబైలో ఇద్దరూ వెంటవెంటనే కనిపించారు. ఆ తర్వాత మాల్దీవ్స్ లో ఉన్నట్లు పిక్స్ ను వేర్వేరుగా పోస్ట్ చేశారు. దీంతో వారిద్దరూ డేటింగ్ లో ఉన్నారని అంతా ఫిక్స్ అయిపోయారు. కానీ తమ మధ్య ఏం లేదని పలుమార్లు రష్మిక, విజయ్ క్లారిటీ ఇచ్చినా.. రూమర్స్ మాత్రం వస్తూనే ఉన్నాయి. ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో విజయ్, రష్మిక డేటింగ్ రూమర్స్ పై చర్చ నడుస్తోంది. అందుకు కారణం దీపావళి సెలబ్రేషన్స్. విజయ్ దేవరకొండ ఇంట్లోనే రష్మిక దివాలీ సెలబ్రేట్ చేసుకున్నారు! ఆ విషయాన్ని ఆమెనే తెలిపారు. కర్ణాటకకు చెందిన రష్మిక.. కొంతకాలంగా హైదరాబాద్ లో ఉంటున్నారు. అనేక ఫెస్టివల్స్ ను ఇక్కడే జరుపుకుంటున్నారు. ఇప్పుడు దీపావళి స్పెషల్ గా ఫోటోస్ షేర్ చేస్తూ.. నెటిజన్లకు, అభిమానులకు ఫెస్టివల్ విషెస్ తెలిపారు. అయితే అక్కడికి కాసేపటి తర్వాత తన పోస్ట్ కి తానే కామెంట్ పెట్టుకున్నారు రష్మిక మందన్న. ఫోటో క్రెడిట్స్ యంగ్ ఆనంద్ దేవరకొండకు ఇచ్చారు. థ్యాంక్యూ ఆనంద అని తెలిపారు. అదే సమయంలో విజయ్, ఆనంద్ కూడా తమ ఇంట్లో పండుగను జరుపుకున్నారు. కాబట్టి రష్మిక కూడా వాళ్లతోనే జరుపుకున్నారని క్లియర్ గా అర్థమవుతుంది. దీంతో నెటిజన్లు.. రష్మిక, విజయ్ ప్రేమలో ఉండటం నిజమేనని చెబుతున్నారు. ఇంట్లో కూడా చెప్పేసినట్టు ఉన్నారని అంటున్నారు. దాంతోపాటు గతంలో ఆనంద్ దేవరకొండ మూవీ ఈవెంట్ లో జరిగిన సంఘటనను గుర్తు చేసుకుంటున్నారు. ఆ కార్యక్రమానికి గెస్ట్ కు వచ్చిన రష్మికకు ఆనంద్.. ఏదో టిపికల్ క్వశ్చన్ అడిగారు. దీంతో ఆమె.. నన్నే స్పాట్ లో పెడతావా.. నేను ఫ్యామిలీ అని అన్నారు. అప్పుడే అంతా ఆనంద్, రష్మిక మధ్య బాండింగ్ చూసి దేవరకొండ ఇంటికి కోడలుగా రష్మిక వెళ్లడం ఖరారైందని అనుకున్నారు. ఇప్పుడు ఆనందే పిక్స్ తీశారని రష్మిక చెప్పడంతో అంతా ఫిక్స్ అయిపోతున్నారు. మరి ఫ్యూచర్ లో ఏం

# సంక్రాంతికి వస్తున్నాం..! వెంకటేష్, అనిల్ రావిపూడి మూవీ ఫస్ట్‌లుక్ రివీల్..!



విక్టరీ వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబోలో మరో క్రేజీ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతున్నది. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి ప్రియురాలిగా నటిస్తున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో షూడింగ్ జరుగుతున్నది. పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ట్రయాంగిల్ క్రైమ్ డ్రామాని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. తాజాగా మూవీ టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు.

మూవీకి 'సక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌ని ఖరారు చేశారు. సినిమా సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు తెలుస్తున్నది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో వెంకటేశ్ లుంగీ ధరించి.. గంభీరమైన భంగిమలో, స్పోర్టింగ్ షేడ్స్, తుపాకీ పట్టుకుని.. ఐశ్వర్య రాజేశ్ చీరలో.. మీనాక్షి చౌదరి మోడ్రన్ అవతార్‌లో కనిపించారు. మూవీ డబ్బింగ్ పనులు మొదలవగా.. షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా.. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జీ ఆదినారాయణ అందించగా, వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

# ఆసుపత్రిలో చేరిన కమల్ హాసన్ సోదరుడు.. ఫొటోలు షేర్ చేసిన సుహాసిని



విలక్షణ నటుడు కమల్ హాసన్ సోదరుడు, సీనియర్ నటుడు, దర్శకుడు, చారుహాసన్ ఆసుపత్రిలో చేరారు ఈ విషయాన్ని ఆయన కుమార్తె, సినీ నటి సుహాసిని మణిరత్నం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. హాస్పిటల్ బెడ్‌పై ఉన్న తన తండ్రితో దిగిన ఫొటోలు, వీడియోలను పంచుకున్నారు.

దీపావళికి ముందు రోజు తన తండ్రి అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. దీపావళి పండుగరోజున ఎమర్జెన్సీ వార్డులో గడిపినట్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తన తండ్రి సర్జరీకి సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. సుహాసిని విడుదల చేసిన వీడియోలో చారుహాసన్ మాట్లాడుతూ.. తాను బాగానే ఉన్నానని తెలిపారు. 'నేను బాగున్నాను. సర్జరీకి సిద్ధంగా ఉన్నా. మళ్లీ మిమ్మల్ని చూస్తాను' అంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. చారుహాసన్ తన ఇంటి డాబాపై పడిపోయినట్లు తెలుస్తోంది.కాగా, 93 ఏళ్ల చారుహాసన్ గత కొంత కాలంగా వయసురీత్యా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో కూడా ఆయన ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. అప్పుడు కోలుకొని ఇంటికి చేరారు. ఇప్పుడు మరోసారి ఆసుపత్రి పాలయ్యారు. చారుహాసన్ తమిళంతోపాటు పలు తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ చిత్రాల్లో నటించారు. ఆయన చివరిసారిగా ఈ ఏడాది విడుదలైన 'హర' అనే తమిళ చిత్రంలో కనిపించారు.

# పొట్టి నిక్కరులో కీర్తి.. స్టన్నింగ్ గ్లామర్ సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్



సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ సోషల్ మీడియాలో ఈమధ్య తన గ్లామర్ తో ఊహించని షాక్ ఇస్తోంది. ఫెరారీ వరల్డ్ యాసిలాండ్‌లో రోలర్ కోస్టర్ రైడ్‌ను ఆనందిస్తూ కనిపించారు. ఈ ఫోటోలో కీర్తి, గ్రీన్ షర్ట్, వైట్ షార్ట్ లో స్టైలిష్‌గా నిలబడి, కూల్ సన్‌గ్లాసెస్, బేస్‌బాల్ క్యాప్‌తో మరింత ఆకర్షణీయంగా కనిపించారు. ఆమె ఎంతో ఆనందంతో ఫ్యాన్స్‌తో ఈ లుక్ ని షేర్ చేసుకున్నారు.. ' అంటూ క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ఫోటో నెట్‌జన్లను ఆకట్టుకుంది. ఇందులో ఆమె వేసుకున్న గ్రీన్ జాకెట్, తెలుపు షార్ట్, మరియు రంగులైన షూస్ ప్రత్యేకంగా నిలిచాయి. ఈ కాంబినేషన్ ఆమె మోడర్న్ యూత్ స్టైల్స్‌కు ప్రతీకగా నిలిచింది. ఇక బాలీవుడ్ కు వెళ్లిన అనంతరం కీర్తి గ్లామర్ విషయంలో సరికొత్తగా కనిపిస్తోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. టైర్ 2లో న్యూ రికార్డ్ కీర్తి సురేష్ ప్రస్తుతం దక్షిణాది సినిమాలే కాకుండా, బాలీవుడ్ వైపు కూడా అడుగులు వేస్తూ తనకంటూ ప్రత్యేకమైన స్థానం ఏర్పరుచుకుంటున్నారు. ఆమె చేతిలో ప్రస్తుతం తమిళంలో మూడు సినిమాలు, హిందీలో ఒక సినిమా చేస్తోంది. తమిళంలో విజయ్ నటించిన తెరికి సినిమాను హిందీలో రీమేక్ చేస్తూ, కీర్తిని కథానాయకిగా తీసుకున్నారు. కీర్తి సురేష్‌కి ఇన్‌స్టాగ్రామ్‌లో పెద్ద సంఖ్యలో ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె ఫోటోలు ఎప్పటికప్పుడు అభిమానులను కట్టిపడేసే విధంగా ఉంటాయి. ఈ మధ్యకాలంలో ఫిట్‌నెస్, స్టైల్ మీద మరింత దృష్టి పెట్టిన కీర్తి, తన లుక్స్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఇటీవలే ఆమె జిమ్ లో వర్కౌట్ ఫోటోలు కూడా పోస్ట్ చేయడం ద్వారా ఫిట్‌నెస్‌పై తన పట్టుదలను చాటారు. ఈ ఫోటో ద్వారా కీర్తి సురేష్ తన జీవితం నుండి చిన్న చిన్న సంతోషాలను పంచుకుంటూ తన అభిమానులతో కూడా అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు.

# జడేజా పాంచ్ పటాకా.. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ ఆలౌట్



**ముంబై-నవభూమి:** వాంఖడేలో జరుగుతున్న మూడో టెస్టులో న్యూజిలాండ్ మూడో సెషన్‌లోనే ఆలౌటయ్యింది. భారత స్పిన్నర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు చేతులెత్తేయగా టీ తర్వాత కాసేపటికే కివీస్ కుప్పకూలింది. రవీంద్ర జడేజా(5/65), వాషింగ్టన్ సుందర్(4/81)లు తిప్పేయగా 250 లోపే పర్యాటక జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న డారిల్ మిచెల్(82)ను ఔట్ చేసిన సుందర్.. అజాజ్ పటేల్(7)ను ఎల్బీగా వెనక్కి పంపి న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో, కివీస్ 235 పరుగులకే పది వికెట్లు కోల్పోయింది.తొలి రెండు టెస్టుల్లో భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న న్యూజిలాండ్ బ్యాటర్లు వాంఖడేలో విఫలమయ్యారు. టాపార్డర్ విఫలమవ్వగా.. డారిల్ మిచెల్(82), విల్ యంగ్ (71) లు అర్ధ శతకాలతో జట్టును ఆదుకున్నారు. అయితే.. రవీంద్ర జడేజా(5/65), వాషింగ్టన్ సుందర్(4/81)లు తమ మ్యాజిక్ చూపిస్తూ కివీస్ బ్యాటర్లను వణికించారు.టీ బ్రేక్ తర్వాత మిచెల్ ధాటిగా ఆడాడు. సుందర్‌ను టార్గెట్ చేస్తూ సిక్సర్లు బాదాడు. అయితే.. అతడి బౌలింగ్‌లోనే స్లిప్‌లో రోహిత్ శర్మకు సులువైన క్యాచ్ ఇచ్చి సెంచరీ చేజార్చుకున్నాడు. అదే ఓవర్లో అజాజ్ పటేల్(7) సిక్సర్ బాదేసి.. ఎల్బీగా వెనుదిరిగడంతో కివీస్ 235 పరుగులకు ఆలౌటయ్యింది.

**14వ సారి ఐదు వికెట్లు**

లంచ్ తర్వాత జడేజా చెలరేగాడు. క్రీజులో పాతుకు పోయిన యంగ్, మిచెల్‌ల జోడీని విడదీశాడు. నాలుగో వికెట్‌కు 75 రన్స్ జోడించి విల్ యంగ్(71)ను బోల్తా కొట్టించాడు. అదే ఓవర్లో వికెట్ కీపర్ టామ్ బ్లండెల్(0)ను కూడా ఔట్ చేసి పర్యాటక జట్టును ఒత్తిడిలో పడేశాడు. అంతేనా.. మరికాసేపట్లో టీ అనగా గ్లెన్ ఫిలిఫ్స్(3)ను కూడా బౌల్డ్ చేసిన జడేజా న్యూజిలాండ్‌ను ఆలౌట్ ముంగిట నిలిపాడు. అయితే.. మిచెల్ పట్టుదలగా ఆడి జట్టు స్కోర్ 200 దాటించాడు.

# ఇంగ్లండ్ స్టార్లకు సెంట్రల్ కాంట్రాక్ట్.. 29 మందిలో ఉన్నది వీళ్లే..!



**ముంబై-నవభూమి:** ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్టులు ప్రకటించింది. తద్వారా జాతీయ జట్టుకు ఆడుతున్న ఆటగాళ్లకు రెండేండ్ల, వార్షిక ప్రతిపాదికన ఈసీబీ జీతాలు చెల్లించనుంది. టీ20, వన్డే సారథి జోస్ బట్లర్ తో పాటు టెస్టు జట్టు నాయకుడు బెన్ స్టోక్స్ రెండేండ్ల కాలానికి బోర్డుతో అగ్రిమెంట్ చేసుకున్నారు. మొత్తంగా 29 మందితో ఇంగ్లండ్ బోర్డ్ కాంట్రాక్ట్ కుదుర్చుకుంది.ఏడుగురికి రెండేండ్ల పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. 19 మంది క్రికెటర్లు వార్షిక కాంట్రాక్ట్ సొంతం చేసుకోగా.. మరో ముగ్గురు యువ ఆటగాళ్లు ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ పేరిట కాంట్రాక్ట్ సాధించారు. ఇంతకుముందు స్టోక్స్ ఏడాది కాంట్రాక్ట్ మాత్రమే తీసుకున్నాడు. మరోవైపు బట్లర్ రెండు సంవత్సరాల పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ మీద సంతకం చేశాడు. ఇప్పుడు ఈ ఇద్దరితో ఈసీబీ రెండేండ్ల పాటు ఒప్పందం చేసుకుంది. ఇక వికెట్ కీపర్ జేమీ స్మిత్ సైతం రెండేండ్ల పాటు జాతీయా జట్టుకు ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఆల్‌రౌండర్ విల్ జాక్స్, ఓపెనర్ ఫిల్ సాల్ట్, స్పిన్నర్ షోయబ్ బషీర్, పేసర్ ఓలీ స్టోన్‌లకు కూడా 2 ఏండ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. యువ క్రికెటర్లు జాకబ్ బెథెల్, జాన్ టర్నర్, జోష్ హల్‌లు ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు సంపాదించారు.

నవక్రీడ

# భావి తారలపై కాసుల వర్షం.. 14 కోట్లు పలికిన జురెల్.. మయాంక్‌కు 11 కోట్లు



**ముంబై-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రికెటర్ల పంట పండింది. తమ ప్రతిభతో ఫ్రాంచైజీ యజమానుల మనసు గెలిచిన కుర్రాళ్లకు జాక్‌పాట్ తగిలింది. అవును.. రిటైన్ జాబితాలో అందర్నీ ఆశ్చర్యపరుస్తూ యువకెరటాలు రికార్డు ధర దక్కించుకున్నారు. సీనియర్లను కాదని మరీ ఫ్రాంచైజీలు భావి తారలకే జై కొట్టాయి. దాంతో గత సీజన్‌లో లక్షల్లో పలికిన వాళ్లంతా ఇప్పుడు కోట్లకు పడగలెత్తారు. ఏకంగా వెయ్యి రెట్లు అత్యధికంగా ఆర్జించనున్నారు. ఇంతకూ వాళ్లు ఎవరో తెలుసా..? రాంచీ టెస్టు హీరో ధ్రువ్ జురెల్. జూనియర్ మలింగ, రజత్ పాటిదార్, మయాంక్ యాదవ్, సాయి సుదర్శన్, శశాంక్ సింగ్, రింకూ సింగ్.ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన యువ క్రికెటర్ల కష్టం వృథా కాలేదు. ఫ్రాంచైజీలు వాళ్లకు తగిన న్యాయం చేస్తూ రికార్డు ధర ఆఫర్ చేశాయి. రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం అయితే ధ్రువ్ జురెల్ వేతనాన్ని ఏకంగా వెయ్యి రెట్లు పెంచేసింది. గత సీజన్‌లో 20 లక్షలే పలికిన అతడికి ఇప్పుడు రూ.14 కోట్లు ఇవ్వనుంది. దాంతో, 17వ సీజన్‌తో పోల్చితే జురెల్ ఆదాయం 6,900 శాతం పెరిగింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**